ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టరు, ఎస్పీ తదితరులు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువెత్తాయి. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో గురువారం ఈ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది ఎస్సీ, ఎస్టీలు వివిధ సమస్యలపై తరలివచ్చారు. మొత్తం 238 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. కలెక్టరు వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, డీఆర్‌ఓ మలోల, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డిప్యూటీ కలెక్టరు రామ్మోహన్, ఆర్డీఓ కేశవనాయుడు, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, సోషల్ వెల్ఫేర్ డీడీ రాధిక వినతులు స్వీకరించారు. కలెక్టరు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయరాదన్నారు.

కలెక్టరు గైర్హాజరుపై నిరసన

ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ ప్రారంభం కాగానే బాధితులు వినతులు ఇవ్వడానికి వచ్చారు. అక్కడ కలెక్టరు లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకుడు సాకే హరి అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా ఇలాంటి గ్రీవెన్స్‌కు కలెక్టరు రాలేనపుడు ఎందుకు పెట్టాలని బైఠాయించి నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న కలెక్టరు వినోద్‌కుమార్ వెంటనే గ్రీవెన్స్‌కు వచ్చారు. సీఎస్ కాన్ఫరెన్స్ ఉండటంవల్ల రాలేకపోయాననీ, ఇక నుంచి తనతోపాటు అన్నిశాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణ కమిషన్ వచ్చిన రోజు వేదికపైనే ఆన్‌లైన్‌లో పేకాట ఆడిన డీఆర్‌ఓపై ఏమి చర్యలు తీసుకున్నారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు ప్రశ్నించారు. దీనిపై రెవెన్యూ కమిషన్ ఆఫీస్ ద్వారా తెలుసుకొని చెబుతానని కలెక్టరు చెప్పడంతో నిరసనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అత్యాచార బాధితురాలికి సాయంపై వాగ్వాదం

జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ అత్యాచారానికి గురికాగా నిబంధనల మేరకు సాయం అందించడంలేదని బాధితురాలు, ఆమెతోపాటు వచ్చిన కొందరు డీఆర్‌ఓ మలోలతో వాగ్వాదానికి దిగారు. నిబంధనల మేరకు భూమి ఇవ్వాల్సి ఉందని ఏళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. దీనిపై వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని డీఆర్‌ఓ హామీ ఇవ్వడంతో శాంతించారు.

బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు



నిందితులను చూపుతున్న ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

తాడిపత్రి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఏడుగురిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ వివరాలను తెలిపారు. పట్టణంలోని రజక కల్యాణ మండపం వద్ద బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని, సీఐ సాయిప్రసాద్, ఎస్ఐ గౌస్‌బాషా సిబ్బందితో దాడులు నిర్వహించారు. సందాని, షబ్బీర్, జిలాన్, డోంగ్రీ హరున్, సురేష్‌బాబు, ముజిద్, మహమ్మద్‌ఖాసీంను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4.20 లక్షలు నగదు, పది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

నీటికుంటలతో బహుళ ప్రయోజనాలు

ఐసీఏఆర్ డీఆర్ఎం కేవీ రావు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నీటి కుంటల నిర్మాణంతో బహుళ ప్రయోజనాలున్నాయని భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డీఆర్ఎం కేవీ రావు తెలిపారు. రేకులకుంట పరిశోధన కేంద్రంలో గురువారం డ్వామా ఆధ్వర్యంలో నీటికుంటల నిర్మాణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీఏఆర్ డీఆర్ఎం కేవీ రావు మాట్లాడుతూ పొలంలో పడే ప్రతి వర్షపునీటి బొట్టును నీటికుంటలో నిల్వ చేసుకుని, రైతులు పండ్లతోటల సాగుకు ఉపయోగించుకోవచ్చన్నారు. భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. డ్వామా పీడీ సలీంబాషా మాట్లాడుతూ జూన్ చివరినాటికి జిల్లాలో 9వేల నీటికుంటల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. సదస్సులో శాస్త్రవేత్తలు విజయశంకర్ బాబు, ప్రసాద్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

పారాహుషార్..!







కనిపించావో..
కాలు బయట పెట్టావో..
కంటి చూపుతో కాల్చిపడేస్తా..!

పని ఏదైనా ఉంటే..
ఈ మార్తాండుడి చూపులు
లేలేతగా ఉన్నప్పుడే చూసుకో..!

కాదూ.. కూడదని
కాని సమయంలో కనిపించావో..
కాలిపోతావ్ జాగ్రత్త..!

అనంతపురంలోని ప్రధాన రహదారులు గురువారం మధ్యాహ్నం ఎండ తీవ్రతకు ఇలా నిర్మానుష్యంగా కనిపించాయి.

బఫర్ పరేషన్..!

- వైసీపీ హయాంలో బియ్యం పక్కదారి
- మిగులు కోత పెట్టి కొత్త డీలర్లకు సరఫరా
- ప్రతి నెలా కార్డుదారులకు మొండిచేయి
- పది నెలలైనా పరిష్కారం కాని సమస్య
- పట్టించుకోని పౌర సరఫరాల శాఖ



అనంతపురంలోని ఓ దుకాణం వద్ద బియ్యం కోసం క్యూలో సంచులు పెట్టి వేచిచూస్తున్న కార్డుదారులు

అనంతపురం టౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా రేషన్ బియ్యం బఫర్ సమస్య పరిష్కారం కాలేదు. వైసీపీ డీలర్లు మిగులు బియ్యాన్ని అప్పగించకపోవడంతో కొత్త డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు, బఫర్ పోనూ మిగిలిన బియ్యాన్ని మాత్రమే డీలర్లకు అందజేస్తున్నారు. మధ్యలో కార్డుదారులు నష్టపోతున్నారు. ప్రతి నెలా కొందరికి బియ్యం అందడం లేదు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోగానే ఆ పార్టీ మద్దతు డీలర్లు కొందరు స్వచ్ఛందంగా డీలర్‌షిప్‌ను టీడీపీ మద్దతుదారులకు అప్పగించారు. మరికొన్నిచోట్ల అధికార పార్టీ వర్గీయులు బలవంతంగా లాగేసుకున్నారు. కానీ అప్పటి వరకూ మిగిలిన స్టాక్‌ను కొత్త డీలర్లకు అప్పగించలేదు. వైసీపీ హయాంలో మిగులు బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే బఫర్ సమస్య పరిష్కారం కావడం లేదని అంటున్నారు.

ఇవీ జిల్లా గణాంకాలు

మొత్త రేషన్‌కార్డులు	6,66,330
లబ్ధిదారులు	20,11,076
నెలావారీగా ఇవ్వాల్సిన బియ్యం	1,11,475 టన్నులు
ఈ నెల మంజూరు చేసిన బియ్యం	81,492గన్నులు
బఫర్ పేరుతో ఈనెలలో బియ్యం కోత	29,983 టన్నులు

29,492 టన్నుల బియ్యం కోత

అధికారిక గణాంకాల ప్రకారం జిల్లాలో 6,66,330 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటికి ప్రతినెలా 1,11,475 టన్నుల బియ్యం విడుదల చేయాల్సి ఉంటుంది. వైసీపీ హయాంలో పేదల బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. లెక్కల్లో మాత్రం మిగులుగా చూపించారు. ప్రభుత్వం మారిన తరువాత కొత్త డీలర్లు నిర్వహణ బాధ్యతలను తీసుకున్నారు. అప్పటికి దాదాపు 40 వేల టన్నుల బియ్యం బఫర్ చూపించారు. అదిపోనూ మిగిలిన కోటా బియ్యాన్ని మాత్రమే విడుదల చేశారు. దీంతో కొత్త డీలర్లు ఖంగుతిన్నారు. సమస్య పరిష్కారం కోసం కొందరు కొత్త డీలర్లు కార్డుదారులకు బియ్యానికి బదులు కేజీకి రూ.15 చెల్లించి.. వేలిముద్రలు వేయించుకున్నారు. అయినా ఇప్పటికీ బఫర్ సమస్య కొనసాగుతూనే ఉంది. అధికారులు చెబుతున్న మేరకు ప్రస్తుతం మార్చి నెల కోటా 1,11,475 టన్నుల బియ్యం మంజూరు చేయాల్సి ఉండగా, బఫర్ స్టాక్ 29,983 టన్నులు పోనూ 81,492 టన్నుల బియ్యం మాత్రమే విడుదల చేశారు. దీంతో ఈ నెల కూడా అనంతపురం, రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు తదితర ప్రాంతాలలో కార్డుదారులకు పూర్తిస్థాయిలో బియ్యం ఇవ్వలేదు. స్టాక్ లేదని, బియ్యం ఇవ్వలేమని డీలర్లు చేతులెత్తేశారు.

పరిష్కారం ఎప్పుడు..?

బఫర్ సమస్యకు పరిష్కారం ఎప్పుడు లభిస్తుందో తెలియని పరిస్థితి. అధికారులు, వైసీపీ నాయకుల కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఎమ్మెల్యేలు వాపోతున్నారు. బియ్యం కోతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బఫర్ స్టాక్ గురించి వైసీపీ డీలర్లను, పౌరసరఫరాల శాఖ అధికారులను కొత్త డీలర్లు ప్రశ్నించినా సమస్య పరిష్కారం కాలేదు. 'మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి.. బఫర్ బియ్యం ఇచ్చేది లేదు' అన్నట్లుగా పాత డీలర్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు సైతం గట్టిగా నిలదీయడం లేదు. అప్పట్లో జరిగిన అక్రమాల్లో అధికారుల పాత్ర ఉన్నందుకే మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. బఫర్ వ్యవహారంపై కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ వర్గీయులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. చివరకు వివాదం పోలీసుల వరకూ వెళ్లింది. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశం పెట్టుకుని మరీ చర్చించారు. బఫర్ పేరిట బియ్యం కోతపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇదో రకం దోపిడీ..

బఫర్ కారణంగా ఇప్పటికే చాలామందికి బియ్యం అందడం లేదు. తాజాగా ఈకేవైసీ చేయించలేదన్న కారణంగా కొందరు డీలర్లు బియ్యం ఎగవేస్తున్నారు. ఆ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఈకేవైసీ చేయించకపోయినా ఈ నెలలో బియ్యం కోత పెట్టవద్దని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయినా కొందరు ఆ ముసుగులో బియ్యాన్ని కాజేస్తున్నారు.

సరిపడా బియ్యం ఇస్తున్నాం..

కార్డుదారులకు సరిపడా బియ్యాన్ని సరఫరా చేస్తున్నాం. ఎక్కడా కోత పెట్టడం లేదు. ఈ నెలలో 81శాతం మందికి బియ్యం పంపిణీ చేశాము. మిగిలిన వారికి ఈనెల 20వ తేదీలోగా అందజేస్తాం. ఈకేవైసీ చేయించలేదని కోత పెట్టకూడదు. ఎవరైనా కోత పెట్టినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

-జగన్నాథరావు, ఇన్‌చార్జి డీఎస్‌ఓ

డీఎస్‌ఓ ఆదేశాల మేరకే..

డీఎస్‌ఓ కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల మేరకు బియ్యాన్ని మంజూరు చేస్తాం. ఎంత స్టాక్ ఇవ్వాలని చెబితే అంతే ఇస్తున్నాం. ఇచ్చిన జాబితా ప్రకారం స్టాక్‌పాయింట్ల నుంచి డీలర్లకు బియ్యం సరఫరా చేస్తాం. మిగులు బియ్యంతో మాకు సంబంధంలేదు.

- రమేష్ రెడ్డి, డీఎం, పౌర సరఫరాల శాఖ

కిసాన్ సభ జాతీయ కౌన్సిల్‌లో చోటు



మల్లికార్జున



కాటమయ్య

అనంతపురం విద్య, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్‌లో జిల్లాకు చెందిన చిరుతల మల్లికార్జున, కాటమయ్యకు చోటు దక్కింది. గత మూడు రోజులుగా తమిళనాడులోని నాగపట్నంలో కౌన్సిల్ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జాతీయ స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా రైతు సంఘం ప్రధానకార్యదర్శి మల్లికార్జున, ఏపీ రాష్ట్ర రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య మూడు దశాబ్దాలుగా జిల్లాలో రైతు సమస్యలపై పోరాటాలు చేస్తున్నారు. వారి సేవలు గుర్తించిన కిసాన్ సభ జాతీయ నాయకులు జాతీయ కౌన్సిల్‌కు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సీపీఐ జిల్లా నాయకులు, రైతు సంఘం నాయకులు వారిని ప్రత్యేకంగా అభినందించారు.

స్కూళ్లలో ఈగిల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలి: డీఈఓ


అనంతపురం విద్య, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల దుష్ప్రయోజనాలపై విద్యార్థులను అప్రమత్తం చేయడానికి అన్ని పాఠశాలల్లో ఈగిల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని డీఈఓ ప్రసాద్‌బాబు.. విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులను గురువారం ప్రకటనలో ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈగిల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అందుకు సంబంధించిన ప్రొఫార్మాలు డీవైఈఓలు, ఎంఈఓలు, హెచ్ఎంలకు మెయిల్ చేశామన్నారు. సంబంధిత అధికారులు ఆ ప్రొఫార్మాలు భర్తీ చేసి, డీఈఓ కార్యాలయానికి మెయిల్ ద్వారా పంపాలని సూచించారు.

నిధులు అడవిపాలు!

- అటవీశాఖలో అనవసర మరమ్మతులు
- కాంట్రాక్టర్ అవతారం ఎత్తిన అధికారులు
- టెండర్, కాంట్రాక్టర్ లేకనే భవనాల రిపేరీ
- అనుమతులు రాకనే కార్యాలయం తరలింపు
- సిబ్బంది భద్రత పేరుతో సొమ్ము దుర్వినియోగం



మరమ్మతులకు ముందు భవనాలు..



మరమ్మతుల తరువాత..

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) జిల్లా అటవీశాఖ కార్యాలయంలో అధికారులు తాము చేయాల్సిన పనులను వదిలేసి, కాంట్రాక్టర్స్ అవతారం ఎత్తారు. శాఖాపరంగా నిర్వహించాల్సిన పనులను వదిలేసి కార్యాలయ భవన మరమ్మతుల్లో నిమగ్నమయ్యారు. పని విలువ రూ.లక్షకు మించితే టెండర్ పిలిచి సివిల్ కాంట్రాక్టర్‌కు అప్పగించి మరమ్మతులు చేయించాలన్న నిబంధనలను తుంగలో తొక్కారు. రూ.పది లక్షలకు పైగా ఖర్చు పెట్టి బీట్ ఆఫీసర్ క్వార్టర్స్, రేంజర్ కార్యాలయానికి మరమ్మతులు చేయిస్తున్నారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలో సీసీఎఫ్ చాంబర్ మినహా మిగిలిన భవనం అంతా బాగానే ఉంది. గతంలో వచ్చిన డీఎఫ్‌ఓ తన చాంబర్‌ను అధునాతన రీతిలో మరమ్మతులు చేయించారు. అలాంటి చాంబర్‌తో నగర నడిబొడ్డున ఉన్న కార్యాలయాన్ని, అనుమతులు లేకుండానే తరలించి నగర శివారు శ్రీనగర్ కాలనీలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇది కార్యాలయానికి వచ్చే వారికి సౌకర్యం లేదు. సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. కార్యాలయ మరమ్మతులకు సంబంధించి దాదాపు కోటి రూపాయల వరకు అంచనాలు తయారు చేసి ఆరునెలల కిందట ఉన్నతాధికారులకు పంపారు. ఇప్పటివరకూ దాని గురించి అతీగతీ లేదు. అయితే కార్యాలయాన్ని మాత్రం అద్దె భవనాల్లో నిర్వహిస్తూ వేలాది రూపాయాలు దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా దాని విలువ రూ.లక్ష దాటితే అందుకు అనుగుణంగా టెండర్ నిర్వహించి కాంట్రాక్టర్‌కు అప్పగించాలి. అలాంటిది నామకే వాస్తే ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా మరమ్మతులకు అంచనాలు వేయించి, అనంతరం ప్రైవేట్ వారితో మరోసారి అంచనాలు తయారు చేయించి వాటికి అనుగుణంగా స్థానిక సిబ్బందే కాంట్రాక్టర్స్ అవతారం ఎత్తి మరమ్మతుల చేయిస్తున్నారు. ఇందులో అటవీశాఖ సిబ్బందికి సివిల్ పనులపై పెద్దగా అవగాహన లేకపోవడంతో నిధుల దుర్వినియోగం జరుగుతోందన్న విమర్శలు వినవస్తున్నాయి. బీట్ ఆఫీసర్ బంగ్లా, రేంజర్ కార్యాలయం, సోషల్ ఫారెస్ట్ కార్యాలయం మరమ్మతులు చేయించాలన్న ఆలోచన ఉన్నప్పుడు జిల్లా కార్యాలయాన్ని మార్చాల్సిన అవసరం లేదు. తాత్కాలికంగా రేంజర్ కార్యాలయం, బీట్ ఆఫీసర్ క్వార్టర్స్ వినియోగించుకోవచ్చన్న చర్చ జరుగుతోంది.

మరమ్మతుల పేరుతో..

సీఎఫ్‌గా యశోదాబాయ్, డీఎఫ్‌ఓగా విఘ్నేష్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శాఖపరంగా అభివృద్ధి పనులకంటే వ్యక్తిగత సౌకర్యాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీసీఎఫ్ బంగ్లా వినియోగంలో ఉన్నదానికే రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేసి మరమ్మతులు చేయించారు. సర్కిల్ మొత్తం ఎక్కడ అవకాశం ఉంటే అక్కడి నిధులు తెచ్చి వినియోగించారన్న విమర్శలున్నాయి. మరమ్మతుల పేరుతో జిల్లా అటవీశాఖ కార్యాలయాన్ని ఖాళీ చేసి, నగర శివారు ప్రాంతంలోని నూతన భవనంలో అద్దెకు వెళ్లారు. ఆరు నెలలు గడుస్తున్నా.. అనుమతుల గురించి పట్టించుకునే నాథుడే లేడు. ఈక్రమంలోనే డీఎఫ్‌ఓ విఘ్నేష్ బదిలీ అయ్యే అవకాశం ఉందని రాష్ట్ర శాఖ నుంచి సంకేతాలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భవన మరమ్మతులకు అనుమతులు రాకపోతే.. ఇప్పటికే ఖర్చు పెట్టిన నిధులకు ఎవరు బాధ్యత వహిస్తారన్న పశ్నలు తలెత్తుతున్నాయి.



సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం..

సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కార్యాలయం మార్పునకు తగిన చర్యలు చేపట్టాం. అయితే అనుమతుల మంజూరు కొంత ఆలస్యం అవుతుండటంతో ఇబ్బందిగా ఉంది. ఉన్నతాధికారులకు నివేదించి వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయించి మరమ్మతులు పూర్తి చేయిస్తాం.

-విఘ్నేష్, జిల్లా అటవీశాఖాధికారి

చీనీ కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



కొనేవారు కరువు..

- ఆశాజనకంగా చీనీ దిగుబడులు
- పాతాళానికి పడిపోయిన ధరలు
- కొనడానికి ముందుకురాని వ్యాపారులు
- మొహం చాటేస్తున్న వైనం
- అన్నదాతల్లో ఆందోళన

కూడేరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కూడేరు, గార్లదిన్నె, రాప్తాడు, తాడిపత్రి, పామిడి, ఆత్మకూరు, శింగనమల తదితర మండలాల్లో దాదాపు 95 వేల ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. అత్యధికంగా కూడేరు, గార్లదిన్నె మండలాల్లో ఏకంగా 30 వేల ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. జిల్లాలో ఐదారేళ్లుగా చీనీ పంటకు ఆశించిన ధరలు ఉంటుండడంతో వ్యాపారులు తోటల వద్దనే కాయలను కొనుగోలు చేశారు. ఈ ఏడాది చీనీ పంటకు ఎకరాకు లక్షకుపైగా అప్పు చేసి, పెట్టుబడులు పెట్టారు. దిగుబడి ఆశాజనంగా రావడంతో ధర బాగా పలికితే అప్పుల నుంచి బయట పడతామని అన్నదాతలు ఆశించారు. మార్కెట్‌లో ధర పతనం కావడంతో ఊహించని షాక్ తగిలింది. పది టన్నులకు రెండు టన్నుల సూట్‌తో చీనీ టన్ను ధర రూ.25 వేలలోపే పలుకుతోంది. గతేడాది రంజాన్ పండుగ తర్వాత ఏప్రిల్, మే నెలల్లో టన్ను చీనీ రూ.38 వేల నుంచి రూ.45 వేల వరకు ధర పలికింది. దీంతో చీనీ వ్యాపారులు కాయలు కొనడానికి తోటల వద్దకు క్యూ కట్టారు. ఈ ఏడాది రంజాన్ పండుగ దాటినా వ్యాపారులు చీనీతోటల వైపు కన్నెత్తి చూడకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది.


రంగు మారుతున్న కాయలు

బోరు నీటితో సాధారణంగా చీనీ కాయలు రంగు మారడానికి చాలా సమయం పడుతుంది. వర్షపు నీటికి త్వరగా కలర్ మారిపోతాయి. ఈ ఏడాది అకాల వర్షాల ప్రభావం చీనీ కాయలపై కూడా పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు కాయలు కలర్ మారడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చెట్లపైనే కాయలు కలర్ మారుతుండటంతో ఎక్కువ రోజులు కాయలు పెట్టుకునే పరిస్థితి లేదు. చీనీ కాయలను కొనుగోలు చేసే వ్యాపారులు రాకపోవడంతో తోటల్లో ఎక్కడ చూసినా కాయలు కనిపిస్తున్నాయి.

అన్నదాతలు లక్షల రూపాయల అప్పులు చేసి, చీనీ సాగు చేశారు. ఏళ్లపాటు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. మొదట్లో ధర అంతగా లేదు. ఉగాది, రంజాన్ పండుగల వేళ పెరుగుతుందని అన్నదాతలు ఆశగా ఎదురుచూశారు. పంటను కోయకుండా అలాగే ఉంచారు. పండుగలు వెళ్లిపోయాయి. ధరలు మాత్రం పెరగలేదు. మరింత పడిపోయాయి. టన్ను రూ.25 వేలు కూడా ధర పలకట్లేదు. ఆ ధరకే అమ్ముదామనుకున్నా.. వ్యాపారులు రావట్లేదు. సాధారణంగా తోటల చుట్టూ తిరిగే వ్యాపారులు ఈసారి కనిపించట్లేదు. దీంతో రైతులే.. వ్యాపారుల వద్దకెళ్తున్నారు. కోస్తామని చెప్పిన వ్యాపారులు సైతం తరువాత మొహం చాటేస్తున్నారు. ఫోన్లు చేస్తున్నా.. వ్యాపారులు అందుబాటులోకి రావట్లేదని రైతులు వాపోతున్నారు. పంటను ఎలా అమ్ముకోవాలో దిక్కు తోచక అన్నదాతలు అయోమయంలో పడ్డారు. దీనికితోడు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చీనీ కాయలు రంగు మారుతున్నాయి. ఇది అన్నదాతల్లో మరింత ఆందోళన రేపుతోంది.

నాటి వైభవం ఏదీ..?

జిల్లాలోనే కూడేరు, గార్లదిన్నె మండలాలు చీనీ సాగుకు ప్రసిద్ధి. కాయలు కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఈ మండలాల్లో తిష్ట వేసేవారు. ఇక్కడే ఇళ్లు అద్దెకు తీసుకుని, ఉండేవారు. ఐదారేళ్ల క్రితం కర్నూలు జిల్లా సిరివెళ్లి ప్రాంతం నుంచి చీనీ వ్యాపారులు అధికంగా వచ్చేవారు. దీంతో వ్యాపారులు గ్రామాల్లో నిత్యం జీపులు, ద్విచక్రవాహనాల్లో తిరుగుతూ కాయల కోసం పోటీ పడేవారు. తోటల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వ్యాపారుల చుట్టూ రైతులు తిరిగే దుస్థితి దాపురించింది. రోజురోజుకీ చీనీ ధర పతనం అవుతుండడంతో కాయలు కొన్న వ్యాపారులు సైతం కోయడానికి మొహం చాట్టేస్తున్నారు. దీంతో అన్నదాతలు కాయలు కొన్న వ్యాపారి కోసం పలుసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు. గతంలో చీనీకాయల కోసం తోటల వద్దకు వ్యాపారులు క్యూ కడితే... ఈసారి వారి చుట్టూ రైతులు తిరిగే పరిస్థితి ఏర్పడింది.



విరగ్గాసిన చీనీ



వర్షానికి రంగుమారిన చీనీ కాయలను చూపుతున్న రైతు ఎద్దుల సుధాకర్

తీవ్రంగా నష్టపోతున్నాం



మూడెకరాల్లో 430 చీనీ చెట్లు సాగు చేశా. రూ.3.5 లక్షల వరకు పెట్టుబడులు పెట్టా. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో అప్పుల నుంచి గట్టెక్కుతామని ఆనందపడ్డా. ధర పతనం కావడంతో షాక్‌కు లోనయ్యా. కాయలు కోత దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ధర రూ.25 వేలు కూడా పలకట్లేదు. కొనడానికి వ్యాపారులు కూడా ముందుకు రావట్లేదు. చీనీ సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నాం. మద్దతు ధరతో ప్రభుత్వమే చీనీ కాయలు కొనుగోలు చేయాలి.

- జీడిపల్లి హనుమంతు, చీనీ రైతు, అంతరగంగ, కూడేరు మండలం

దిక్కుతోచని స్థితి..



ఆరెకరాల్లో 900 చీనీ చెట్లు సాగు చేశా. రూ.8 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగుండటంతో ధర దక్కితే అప్పులు తీరిపోతాయనుకున్నా. ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నా. అకాల వర్షాలు ఆందోళన రేపుతున్నాయి. ఈ ఏడాది చీనీ రైతుల కష్టాలు వర్ణనాతీతం.


- కోనంకి జయరాం, చీనీ రైతు, గొటుకూరు, కూడేరు మండలం

ఉజ్వల భవితకు పాలిసెట్

పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగాల విషయంలో బీటెక్ వారికంటే పాలిటెక్నిక్ విద్యార్థులకే ప్రాధాన్యం ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ సెక్టార్‌లోను పాలిటెక్నిక్ వారికే పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఇప్పటికే పాలిసెట్‌కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పాలిసెట్ కన్వీనర్ సురేష్‌బాబు తెలియచేశారు. జిల్లాలో పాలిసెట్ పరీక్ష హిందూపురం, ధర్మవరం, కదిరి, పాలిటెక్నిక్ కళాశాలల్లో జరుగనుంది. పాలిసెట్‌కు జిల్లావ్యాప్తంగా దాదాపు 5వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో నాలుగు ప్రభుత్వ, ఒక ప్రైవేట్ కళాశాల ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి, పుట్టపర్తిరూరల్/కొత్తచెరువు

- ఈనెల 30న ప్రవేశ పరీక్ష
- పాలిటెక్నిక్‌తో త్వరగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



పాలిటెక్నిక్‌లో ప్రవేశం ఇలా...

ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సు చదివిన విద్యార్థులు, బ్రిడ్జి కోర్సు అర్హత సాధించివారు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు. ఐటీఐ ట్రేడ్‌లో 60శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు బ్రిడ్జి కోర్సు ద్వారా నిర్వహించే అర్హత పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. ఈపరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ద్వితీయ ఏడాది, పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులలో అడ్మిషన్ పొందవచ్చు. ప్రస్తుతం పదోతరగతి రాసిన విద్యార్థులు, ఇదివరకే పదో తరగతి పూర్తి చేసిన వారు పాలిసెట్ రాసి మెరుగైన ర్యాంకులతో కళాశాలల్లో చేరవచ్చు.

చక్కటి ఉపాధి



డిప్లొమా కోర్సులతో చక్కటి ఉపాధి లభిస్తుంది. వివిధ సంస్థలు డిప్లొమా పూర్తి చేసిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. జీవితంలో త్వరగా స్థిరపడటానికి పాలిటెక్నిక్ సరైన మార్గం. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇదో మంచి అవకాశం. డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం, ఉపాధి పొందవచ్చు.

- సురేష్‌బాబు, శ్రీ సత్యసాయిజిల్లా పాలిసెట్ కన్వీనర్

ఉక్కపోత.. రోగాల మోత

- చిన్నారులకు ఆటలమ్మ గవదబిళ్లలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

కొత్తచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వేసవికాలం వచ్చిందంటే చాలు కొంతమందికి అనారోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. ముఖ్యంగా చిన్నారుల్లో ఆటలమ్మ, గవదబిళ్లలు (చికన్‌ఫాక్స్) సోకుతుంటాయి. మండలంలోని చాలా గ్రామాల్లో ఆటలమ్మ, గవదబిళ్లలు కేసులు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిబారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా వాపు, నొప్పి తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయసుల వారికి ఈ అంటువ్యాధి వ్యారిసెల్లా అనే వైరస్ వల్ల సోకే అవకాశం ఉంది. చిన్నారుల్లో ఎక్కువగా వస్తుంటుంది. అంటువ్యాధులు సోకకుండా 9 నెలల వయసులోనే చిన్నారులకు టీకా వేస్తామని కొత్తచెరువు సీహెచ్‌సీ వైద్యాధికారి అశ్వర్థకుమార్ తెలిపారు. ముందు జాగ్రత్తలు, అప్రమత్తతతో వ్యవహరిస్తే రక్షణ పొందవచ్చునని సూచిస్తున్నారు.

ఆటలమ్మ, గవదబిళ్లల లక్షణాలు

సాధారణంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. చిన్నారులు బలవర్ధకమైన ఆహారం తీసుకొనేలా తల్లిదండ్రులు శ్రద్ధచూపాలి. ఆటలమ్మ, గవదబిళ్లలు సోకినవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి మందగించడం, ఆహారం సరిగా తీసుకోలేకపోవడం వల్ల తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మ, గవదబిళ్లలుగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రత ఆధారంగా వైద్యుల సలహా మేరకు యాంటీ బయోటిక్, యాంటీ వైరస్ మందులు వాడాల్సి ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఆటలమ్మ, గవదబిళ్లలు సోకినవారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు ఇవ్వాలి. గవదబిళ్లలు వచ్చిన వారికి గొంతు నొప్పి తీవ్రంగా ఉంటుంది. తరచూ ద్రవపదార్థాలు తీసుకోవాలి. ఆటలమ్మ, గవదబిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢనమ్మకాలతో వైద్యుల సలహా తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.



నిర్లక్ష్యం తగదు



ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్షం తగదు. చిన్నారులు ఎక్కువగా ఈ వ్యాధుల బారినపడుతుంటారు. వ్యాధి లక్షణాలు కనిపించగానే డాక్టర్‌ను సంప్రదించి వారి సూచన మేరకు మందులు వాడాలి.

- డాక్టర్ అశ్వత్థకుమార్, సీహెచ్‌సీ వైద్యాధికారి, కొత్తచెరువు

ఏపీజీఈఏ సంఘం ఒక్కటే

- డూప్లికేట్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం
- అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీజీఈఏ) ఒక్కటే ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ స్పష్టం చేశారు. సంఘం పేరుతో చలామణి అవుతున్న కొందరు డూప్లికేట్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 15న ఏపీజీఈఏ సంఘమంటూ ఇదివరకే సంఘం నుంచి తొలగించిన శ్రీకాంత్ రాజు, ఆస్కార్‌రావులు, జిల్లా నాయకులుగా పాల్గొన్న రమణకుమార్‌లు తమ సంఘం నేతలపై అవాకులుచవాకులు పేలడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై పోరాటం చేస్తూ జీతాల చెల్లింపులు చట్టబద్ధం చేయాలని తదితర వాటిపై పోరాటం చేసిన నాయకుడు కేఆర్. సూర్యనారాయణ అన్నారు. అలాంటి నేతపై ఆస్కార్‌రావు, శ్రీకాంత్‌రాజు, రమణకుమార్‌లకు విమర్శలు చేసే అర్హత లేదన్నారు. గతంలో ఏపీజీఈఏ సంఘంలో అక్రమాలకు పాల్పడటంతో పాటు సంఘం పేరు, లోగో, లెటర్‌పాడ్స్‌ను దుర్వినియోగపరుస్తూ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉద్యోగులను మోసం చేసిన చరిత్ర శ్రీకాంత్ రాజు, ఆస్కార్‌రావులదన్నారు. వారిపై విజయవాడ లోని భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నెం. 14/2025 క్రిమినల్ కేసు నమోదైందన్నారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు వేణుగోపాల్, మహిళా అధ్యక్షురాలు సాంబశివమ్మ, నగర అధ్యక్షులు షేక్ రఫీ, నాయకులు వినోద్, తిమ్మరాజు, నాగేశ్వరయ్య, నాగరాజు, ఈశ్వరయ్య, శ్రీరాములు, హనుమంతు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపీకృష్ణ

1 నుంచి వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు

కొత్తచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయభాస్కర్ గురువారం ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు, విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, ఫుట్‌బాల్, హాకీ, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. కోచ్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల ప్రభుత్వ, ప్రైవేటు పీఈటీలు, పీడీలు, క్రీడా వికాస కేంద్రాల శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, ఔత్సాహికులు ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని డీఎస్‌డీఓ తెలిపారు. వివరాలకు 9849421462 నంబరులో సంప్రదించాలన్నారు.

దళిత రైతులకు దగా

- రీ సర్వేలో భూములు మాయం
- దేవదాయ, ప్రభుత్వ భూములుగా మార్పు
- 20 ఏళ్ల క్రితం పంపిణీ చేసిన టీడీపీ ప్రభుత్వం
- తహసీల్దారు కార్యాలయం చుట్టూ బాధితుల ప్రదక్షిణ

విడపనకల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దళిత మహిళా రైతులకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. రెండు దశాబ్దాల క్రితం వారికి పంపిణీ చేసిన భూములను వారికి కాకుండా చేసింది. రీసర్వే పేరుతో విడపనకల్లు మండలంలో 200 ఎకరాలకు పైగా భూములను ఆన్‌లైన్‌లో దేవదాయ, ప్రభుత్వ భూములుగా మార్చేసింది. దీంతో బాధిత రైతులకు పంట రుణాలు, ప్రభుత్వ పథకాలూ అందడం లేదు. 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒక్కో దళిత మహిళకు ఎకరం నుంచి రెండెకరాల వరకూ సాగు భూమిని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి, పంపిణీ చేసింది. పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఇచ్చింది. భూ కొనుగోలు పథకం కింద మాగాణి అయితే ఎకరం, బయలు పొలం అయితే రెండెకరాల ప్రకారం 360మందికి పంపిణీ చేశారు. ఈ భూములపై పంట రుణాలను కూడా రైతులు తీసుకున్నారు.

వైసీపీ హయాంలో..

రీ సర్వేతో 43, 288ఏ, 46, 219, 52 సర్వే నంబర్లలోని 200 ఎకరాలకుపైగా రైతుల పొలాలను దేవదాయ, ప్రభుత్వ భూములుగా మార్చేశారు. పాత రికార్డుల ప్రకారం భూమి ఏ స్వరూపంలో ఉంటే అలాగే చూపించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. దీంతో దేవదాయ భూమిని లబ్ధిదారుల పేరిట మార్చేందుకు వీలులేకుండా పోయిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు లేక పోవటంతో బాధిత రైతులు బ్యాంకుల్లో పంట రుణాలను రెన్యూవల్ చేయించుకోలేకపోతున్నారు. ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఆన్‌లైన్‌లో వన్‌బీ, అడంగల్ వచ్చేలా చూడాలని పట్టాదారు పాసుపుస్తకాలను పట్టుకుని బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఏ అధికారీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





దళిత మహిళలకు ఇచ్చిన భూమి

నా పేరు లేకుండా చేశారు...



సర్వే నంబరు 43లో నాకు ఎకరం మాగాణి భూమిని 20 ఏళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చింది. అప్పుడే నాకు పాసుపుస్తకం ఇచ్చారు. రీ సర్వేలో దేవాలయ భూమిగా మార్చేశారు. పాసుపుస్తకాల్లో నాపేరు ఉంది. కంప్యూటర్‌లో మాత్రం రావటం లేదు. వన్‌బీ, అడంగల్ ఇవ్వడంలేదు.

- గంగమ్మ, రైతు, కరకముక్కల

రీ సర్వేలో మార్చేశారు..



సర్వే నంబరు 288ఏలో నాకు రెండెకకరాల మెట్ట భూమిని ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో భూ రీసర్వే చేసి, నా పొలాన్ని దేవాలయ భూమిగా ఆన్‌లైన్‌లో మార్చేశారు. దీంతో బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు అందట్లేదు. మా భూమిని తిరిగి ఆన్‌లైన్‌లో చేర్చాలి.

- ఉలిగమ్మ, రైతు, కరకముక్కల

అలసిపోయా..



సర్వే నంబరు 46లో నాకు ఎకరం మాగాణి పొలం ఇచ్చారు. భూ రీసర్వే పేరుతో మా పొలాన్ని దేవాలయ భూమిగా మార్చి మా పొట్ట కొట్టారు. 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. ఏనాడూ ఇలాంటి సమస్య రాలేదు. ప్రస్తుతం అండగల్, వన్‌బీ రాక ఇబ్బందులు పడుతున్నాం.

- ఎల్లమ్మ, రైతు, కరకముక్కల

ఆన్‌లైన్‌లో వచ్చేలా చూడండి..



సర్వే నంబరు 43లో నాకు ఎకరం మాగాణి పొలం ఇచ్చారు. 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. గత ప్రభుత్వంలో రీ సర్వే మా పొలాన్ని ప్రభుత్వ భూమిగా మార్చేశారు. దీంతో ప్రభుత్వ పథకాలు అందట్లేదు. ఏటా వన్‌బీల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళితే మాన్యువల్‌గా ఇస్తున్నారు. వాటిని బ్యాంకు అధికారులు తీసుకోవట్లేదు. ఇది చాలా అన్యాయం.

- తిప్పమ్మ, రైతు, కరకముక్కల





దళిత మహిళలకు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకం

న్యాయం చేస్తాం..

రీ సర్వేలో జరిగిన పొరపాటును పరిశీలించి, దళిత రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం. రికార్డులను పరిశీలించి, జిల్లా అధికారులతో చర్చించి, ఆన్‌లైన్‌లో వన్‌బీలు అడంగల్ వచ్చేలా చర్యలు చేపడతాం.

- చంద్రశేఖరయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్, విడపనకల్లు

క్రైం కార్నర్

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

● ఫెయిల్ కావడమే కారణం



జావేద్ (ఫైల్)

గుంతకల్లు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ఫెయిలయ్యానన్న విరక్తితో మహమ్మద్ జావేద్ (18) పట్టణంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. కూడేరులో ఐషర్ డ్రైవరుగా పనిచేస్తున్న జాఫర్ వలి కుమారుడు జావేద్ గుంతకల్లులో తన అమ్మమ్మ ఇంట్లో ఉండి గుత్తి గేట్స్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల పరీక్షా ఫలితాలు రావడంతో అందులో జావేద్ ఫెయిల్ అయ్యాడని అతడి బంధువులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బైక్‌లో వెళ్లిన జావేద్ రాత్రి ఇంటికి తిరిగి రాలేదన్నారు. రాత్రే అతడి స్నేహితులందరినీ విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో గుంతకల్లు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా తిమ్మనచెర్ల రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు, బంధువులు అక్కడకు వెళ్లగా, అక్కడ ట్రాక్ పక్కన ఓ మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు పరిశీలిస్తూ కనిపించారు. ఆ మృతదేహాన్ని జావేద్‌గా అతడి బంధువులు గుర్తించారు. జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర మృతుడు జావేద్ బంధువుల నుంచి ఫిర్యాదును స్వీకరించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసును నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

బైకు దొంగల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్

బత్తలపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి 11 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ గురువారం తెలిపారు. బత్తలపల్లిలోని ఫై జంక్షలో గురువారం ఎస్ఐ సోమశేఖర్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు బైకులలో ఆరుగురు యువకులు వచ్చారు. వారి వద్ద వాహనాలకు సంబంధించిన రికార్డులు లేకపోవడంతో పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ విచారించగా వారు అనంతపురం నగరానికి చెందిన ప్రణయ్, ధనుష్, సిద్ది వినయ్‌తో పాటు మరో ముగ్గురు మైనర్లుగా తేలింది. వీరు బత్తల పల్లి, ధర్మవరం, అనంతపురంలలో 11 బైకులు దొంగిలించి అమ్మినట్లు తెలిపారు. వచ్చిన డబ్బుతో జల్సాలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అమ్మిన బైకులను రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కానిస్టేబుళ్ల ఆంజనేయులు, అనిల్, లింగమయ్య, గోపాల్‌లను సీఐ అభినందించి రివార్డు అందజేశారు.

ఇద్దరు రైతుల బలవన్మరణం



పోతులింగ(ఫైల్)



రామాంజనేయులు(ఫైల్)

గుమ్మఘట్ట/ధర్మవరం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గుమ్మఘట్ట మండల కేంద్రానికి చెందిన రైతు పోతులింగ(45) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ శివారులో చెట్టుకు బుధవారం అర్ధరాత్రి ఉరేసుకున్నాడు. పోతులింగకు రెండెకరాల పొలం ఉంది. మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న, వేరుశనగ పంటలను సాగు చేసి నష్టపోయాడు. అప్పులు రూ.9 లక్షల దాకా పేరుకుపోయాయి. దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య గంగమ్మ, కుమారులు అనిల్, తిప్పేస్వామి ఉన్నారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ధర్మవరం మండలం పోతుకుంటకు చెందిన కౌలు రైతు కొడిమి రామాంజినేయులు(42) విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. రామాంజినేయలు మరూరు వద్ద 5 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని రెండేళ్ల నుంచి వేరుశనగ, కంది సాగు చేస్తున్నాడు. పంటలు సరిగా పండక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.10 లక్షల వరకూ పేరుకుపోయాయి. దిక్కుతోచని స్థితిలో ఇంట్లో ఎవరూలేని సమయంలో గురువారం విషపు గుళికలు మింగాడు. కుటుంబ సభ్యులు గమనించి, అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఆయనకు భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య



బాలకృష్ణ మృతదేహం

ధర్మవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు బాలకృష్ణ(43) గురువారం రాత్రి ఉరివేసుకున్నాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. బాలకృష్ణ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. బాలకృష్ణకు భార్య ప్రమీల, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



ఎర్రిస్వామి (ఫైల్)

రాయదుర్గం టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాశీపురం గ్రామానికి చెందిన రైతు కావలి ఎర్రిస్వామి(54) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తన తోటలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజులు వేసే సమయంలో గురువారం ప్రమాదానికి గురయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అటువైపు వెళ్లిన గొర్రెల కాపరులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ జయనాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎర్రిస్వామికి ఇద్దరు భార్యలు, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే

నేడు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు ప్రాణాలను త్యజించిన రోజు గుడ్‌ఫ్రైడే. చెడుమీద మంచి సాధించిన విజయానికి ప్రతీకగా శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. యేసయ్యకు మరణం లేదని నిరూపించడానికే ఆయన మూడో రోజునే పునరుత్థానం చేశారని బైబిల్ సారాంశం. ఈ పునరుత్థానదినాన్నే క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకుంటారు. ఇంతటి పవిత్రమైన రోజు అయిన గుడ్‌ఫ్రైడేను క్రీస్తు మందిరాలన్నింటిలోనూ సంతాపదినంగా పాటిస్తూ ప్రార్థనలు నిర్వహిస్తారు. యేసు త్యాగనిరతిని స్మరించుకుంటూ ఉపవాసదీక్షను ఆచరిస్తుంటారు క్రైస్తవులు. దీంతో జిల్లాలోని క్రైస్తవ మందిరాలన్నీ గుడ్‌ఫ్రైడేకి సిద్ధమయ్యాయి. రామచంద్రనగర్‌లోని కార్మెల్ మాత, సప్తగిరి సర్కిల్‌లోని ఎస్ఐయూ, అరవిందనగర్‌లోని సీయస్ఐ టౌన్ కాంగ్రిగేషనల్ తదితర చర్చిలన్నీ ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్తాబయ్యాయి.

ఉదయం 10 నుంచి ప్రార్థనలు



గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని చర్చిల్లో ప్రార్థనలు చేస్తారు. గుడ్ ఫ్రైడే రోజున యేసు క్రీస్తు త్యాగాన్ని స్మరించుకుని ప్రార్థనలు నిర్వహిస్తారు. మూడోరోజు ఆదివారం యేసు పునరుత్థానానికి సంకేతంగా చర్చిలను సుందరంగా ముస్తాబు చేసి, ప్రత్యేక ప్రార్థనలు ఆచరిస్తారు.

- స్వామిదాస్, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

బడిపిల్లలు అంటే అంత చులకనా..?

● పాఠశాల వద్ద బస్సులు ఆపకుండా వెళ్లడంపై ఆగ్రహం ● ధర్నాకు దిగిన తల్లిదండ్రులు



బస్సులను అడ్డగించిన విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు

యాడికి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు వదిలిన సమయంలో విద్యార్థులను ఎక్కించుకోకుండా వెళ్తున్న బస్సు డ్రైవర్ల తీరుపై గురువారం మండల కేంద్రంలో వారి తల్లిదండ్రులు, స్థానికులు ధర్నాకు దిగారు. మధ్యాహ్నం పాఠశాలలు వదిలిన సమయంలో యాడికి నుంచి తాడిపత్రి, నిట్టూరు వైపు వెళ్లే విద్యార్థులు బస్సుల కోసం రోడ్డుపై ఎదురుచూస్తున్నారు. ఆ సమయంలో వచ్చిన రెండు ఆర్టీసీ బస్సులు విద్యార్థులను ఎక్కించుకోకుండా వేగంగా వెళ్లిపోయాయి. దీనిని గమనించిన కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు.. ద్విచక్రవాహనాల్లో వెంబడించారు. స్థానిక కోనరోడ్డు సర్కిల్‌లో రోడ్డుకు అడ్డంగా ద్విచక్రవాహనాలు పెట్టి ధర్నాకు దిగారు. బస్సుల డ్రైవర్లు, కండక్టర్లను కిందకు దింపి నిలదీశారు. బడిపిల్లలు అంటే అంత చులకనా.., అటువంటపుడు బస్సు పాసులు ఎందుకు ఇచ్చినట్లు అని మండిపడ్డారు. బడులు వదిలే సమయంలో రోజూ ఇలానే చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. బస్సుల కోసం విపరీతమైన ఎండలో రోడ్డుపై నిలబడి విద్యార్థులు ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు. తాడిపత్రి బస్సు డిపో మేనేజర్ వచ్చేదాకా బస్సులు కదలనిచ్చేదిలేదని రోడ్డుపై అడ్డంగా ధర్నాకు దిగారు. బస్సుడ్రైవర్ల తీరును నిరసిస్తూ స్థానికులు పెద్దఎత్తున గుమికూడారు. దీంతో ట్రాఫిక్ పెద్దఎత్తున స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, విద్యార్థుల తల్లిదండ్రులకు, స్థానికులకు సర్దిచెప్పారు. విద్యార్థులను ఎక్కించుకోకుండా వెళ్లిపోతున్న బస్సు డ్రైవర్లు, కండక్టర్లు మందలించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆర్టీసీ సిబ్బందికి పోలీసులు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు శాంతించడంతో సమస్య సద్దుమణిగింది. బడులు వదిలే సమయంలో బడిపిల్లలను కచ్చితంగా బస్సుల్లో ఎక్కించుకునేలా డిపో మేనేజర్ ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

నెరవేరిన అనంత ప్రజల ఏళ్ల కల

● పుట్టపర్తి-బెంగళూరు రైలు... అనంతపురం వరకూ పొడిగింపు
● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



పార్లమెంటు సమావేశాల్లో రైలు పొడిగింపు అంశంపై మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ (ఫైల్)

అనంతపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి, బెంగళూరు మధ్య నడుస్తున్న మెము రైలును అనంతపురం వరకూ పొడిగిస్తూ రైల్వే బోర్డు ఈనెల 15వ తేదీన ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. గత పార్లమెంటు సమావేశాల్లో రైలు పొడిగింపు అంశంపై అనేక సార్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్), దక్షిణ పశ్చిమ రైల్వే (ఎస్ డబ్ల్యూఆర్) జనరల్ మేనేజర్లను కలిసి పుట్టపర్తి-బెంగళూరు రైలును అనంతపురం వరకూ పొడిగించాలని కోరానన్నారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నను వ్యక్తిగతంగా కలిసి విన్నవించానన్నారు. వారి సహకారంతో రెండు రైల్వే జోన్లను ఒప్పించి, అనంతపురం వరకూ పొడిగించారన్నారు. దీంతో అనంతపురం ప్రజల ఏళ్ల కల నెరవేరిందన్నారు. దీంతో బెంగళూరు వెళ్లే ప్రయాణికులు ఈరైలు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇది సామాన్య ప్రయాణికులతోపాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలకు ఎంతో ఉపశమనం కలిగించే అంశమన్నారు. ఇప్పటి వరకూ ఉన్న స్టాపేజ్‌తో పాటు విధురాశ్వత్థం, కొత్తచెరువు, బాసంపల్లి, చిగిచెర్ల, జంగాలపల్లె, ప్రసన్నాయపల్లి స్టేషన్లలో కూడా ఈ రైలు ఆపుతారన్నారు. ఈ రైలు అనంతపురం స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరి సాయంత్రం 7 గంటలకు బెంగళూరు స్టేషన్‌కు చేరుకుంటుందని ఆయన వివరించారు.

నీరు.. విద్య.. వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వండి

● అధికారులకు ప్రజాప్రతినిధుల సూచన



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, విప్ కాలవ, ఎంపీ బీకే, ఎమ్మెల్యేలు అమిలినేని, దగ్గుపాటి, అస్మిత్ రెడ్డి

అనంతపురం టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీరు, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికార పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు జిల్లా యంత్రాంగానికి సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా మినరల్ ఫండ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్ర బాబు, అస్మిత్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా మినరల్ ఫండ్ కింద 30 శాతం రాయల్టీగా రూ135.34 కోట్లు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 1473 పనులకు రూ61.62 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. వచ్చిన నిధులలో ఇప్పటి వరకూ రూ39.11 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. మరో 403 పనులకు రూ.23.57 కోట్లు కేటాయించామని, ఇంకా రూ52.66 కోట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నిధులలో ఒక్కో జిల్లాకు రూ.3 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ కాలవ కలెక్టరుకు సూచించారు. పనులకు ప్రతిపాదనలను ప్రజాప్రతినిధుల నుంచి తీసుకోవాలని ఎంపీ బీకే సూచించారు. తమ నియోజకవర్గాలలో అభివృద్ధి, ఇతర పనులకు నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యేలు కోరారు.

ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్ఎయిడెడ్ స్కూళ్లలో 2025-26 విద్యా ఏడాదికి 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు డీఈఓ ప్రసాద్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ సిలబస్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ అనుసరిస్తున్న అన్ని ప్రైవేట్ స్కూళ్లలో విద్యాహక్కు చట్టం-2009 సెక్షన్ 12(1) మేరకు 1వ తరగతిలో 25 శాతం ఉచితంగా సీట్లు ఇవ్వాలన్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల వారి పిల్లలకు వారు నివాసం ఉండే సమీపంలోని అన్ని స్కూళ్లలో ఈ ఉచిత సీట్లు కేటాయించాలన్నారు. 1వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకూ దరఖాస్తు చేయాలన్నారు. విద్యార్థుల ఆధార్ కార్డు, ఇతర ప్రాథమిక వివరాలను http://cse.ap.gov.in వెబ్‌సైట్ లో అప్లై చేయాలన్నారు. సంబంధిత గ్రామ సచివాలయం లేదా ఎంఈఓ ఆఫీస్ లేదా సంబంధిత స్కూళ్లలో పిల్లల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను సంబంధిత పాఠశాలల్లో ఉంచుతామన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 18004258599 సంప్రదించాలని సూచించారు.

నాన్నను వచ్చాను.. లేవరా..!

● అమ్మ వచ్చే వరకైనా ఉండరా..!
● కొడుకు మృతదేహంపై పడి రోదించిన తండ్రి
● ఇద్దరు యువకులను మింగిన బైక్ ప్రమాదాలు



సుమంత్(ఫైల్)

పామిడి/అగళి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు బైక్ ప్రమాదాలలో ఇద్దరు యువకులు మృతిచెందారు. దీంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. పామిడి సమీపంలో బైక్ అదుపుతప్పి సుమంత్ (25) అనే యువకుడు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తండ్రి శివప్రసాద్.. పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి కొడుకు మృతదేహాన్ని చూసి కుప్పకూలిపోయారు. 'రేయ్ నాన్నను వచ్చాను లేవరా..! మీ అమ్మ వచ్చేవరకైనా ఉండురా..! మీ అమ్మకు నేను ఏమని సమాధానం చెప్పాలిరా..?' అంటూ ఒక్కగానొక్క కొడుకు సుమంత్ మృతదేహంపై పడి కన్నీరు మున్నీరయ్యారు. అనంతపురం నగరంలోని అశోక్ నగర్‌కు చెందిన శివప్రసాద్ కుమారుడు సుమంత్ టీ కేఫ్ నిర్వహించేవాడు. గుంతకల్లు నుంచి అనంతపురానికి వెళుతుండగా పామిడి శివారులోని అయ్యప్పస్వామి గుడి వద్ద బైక్ అదుపుతప్పింది. 44వ జాతీయ రహదారిపై కల్వర్టుకు ఢీకొట్టడంతో సుమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తండ్రి.. ఆస్పత్రికి వచ్చి గుండె పగిలేలా ఏడ్చారు. మరో ప్రమాదంలో.. అగళి మండలం మధుడి గ్రామానికి చెందిన మంజునాథ్(25) మృతిచెందాడు. కర్ణాటకలోని హసన్‌లో మంజునాథ్ బేకరిలో పని చేసేవాడు. స్వగ్రామానికి గురువారం వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ఈ ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కుమారుని మృతదేహంపై పడి విలపిస్తున్న తండ్రి శివప్రసాద్

పెట్రోల్ బాటిల్‌తో కలెక్టరేట్‌లో మహిళ హల్‌చల్



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న పోలేరమ్మ

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): తన సొంత స్థలాన్ని బంధువులు కబ్జా చేసి, అక్రమంగా నిర్మాణాలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ రామగిరి మండలంలోని దొంతిమర్రి గ్రామానికి చెందిన పోలేరమ్మ గురువారం కలెక్టరేట్‌కు పెట్రోల్ బాటిల్‌తో వచ్చి హల్‌చల్ చేశారు. ఆత్మహత్య చేసుకుంటున్నాని గట్టిగా కేకలు వేయడంతో, గమనించిన పోలీసులు ఆమె వద్ద నుంచి పెట్రోల్ బాటిల్‌ను లాకున్నారు. సమస్యను అధికారులకు చెప్పాలని పంపారు. పోలేరమ్మ మాట్లాడుతూ.. సొంత స్థలంలో బంధువులు అక్రమంగా ప్రహరీ నిర్మించారని, దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక పెట్రోల్ బాటిల్‌తో కలెక్టరేట్ వద్దకు వచ్చినట్లు పేర్కొన్నారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు.

హంద్రీనీవా కాలువకు మళ్లీ గండి



నక్కలగుట్ట కాలనీ సమీపంలో కాలువకు పడిన గండి

సోమందేపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు మళ్లీ గండి పడింది. మండల కేంద్రం సమీపంలోని నక్కలగుట్ట కాలనీ వద్ద గురువారం ఉదయం మడకశిర ఉప కాలువకు గండిపడింది. దీంతో చాకర్లపల్లి కుంటకు, అక్కడి నుంచి చల్లాపల్లి చెరువు నిండి నాగలూరు చెరువుకు నీరు చేరింది. గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద నీటి పంపింగ్‌ను ఆపేశారు. కాలువలో నీటి ప్రవాహం తగ్గిపోయాక గండి పూడ్చే పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 1న 47వ కి.మీ. వద్ద కాలువకు గండిపడి నీరు పొలాలను ముంచెత్తింది. అధికారులు ఆగమేఘాలపై అప్పట్లో గండిని పూడ్చేశారు. ఈ నేపథ్యంలో మళ్లీ గండిపడడం అనుమానాలకు తావిస్తోంది. కాలువగట్లు తెగుతున్నాయా, తెగ్గొడుతున్నారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ పాలనలో కాలువ మరమ్మతులు, నిర్వహణను గాలికొదిలేయడంతో పూడిపోయి, చెట్లు పెరిగిపోయి గండ్లు పడుతున్నాయన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

రుణాల కోసం దళారీలను ఆశ్రయించవద్దు: ఈడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విడుదల చేసిన సబ్సిడీ రుణాల విషయంలో మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సబ్సిడీ రుణాలు ఇప్పిస్తామని కొందరు మధ్యవర్తులు అమాయక ఎస్సీ ప్రజలను మోసం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిని నమ్మి ఎవరూ డబ్బులివ్వ వద్దన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నిష్పక్షపాతంగా స్క్రూట్నీ జరిపి రుణాలు అందజేస్తామన్నారు. మే 10 వరకూ అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంత జిల్లాకు 823 యూనిట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 604 యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు.

రాయి మీదపడి వ్యక్తి మృతి



వేణుగోపాల్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇంటి పైకప్పుపై నుంచి రాయి పడి వేణుగోపాల్(34) అనే వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో ఈ ప్రమాదం బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వర్షం కురుస్తుండటంతో నీరు కారకుండా ఇంటిపైకప్పుపై టార్పాలిన్ కప్పి, బరువుకోసం దానిపై రాళ్లు పెట్టారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి భారీ ఈదురుగాలులు వీయడంతో వరండాలో పడుకున్న వేణుగోపాల్‌పై ఓ రాయి పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య సునంద, కుమారుడు అరుణ్, కూతురు మహాలక్ష్మి ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెటర్లూ... పేర్లు నమోదు చేసుకోండి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 2025-26 క్రికెట్ సీజన్ కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రికెటర్లు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. అండర్-12, 14, 16, 19, 23, సీనియర్ బాల, బాలికల కేటగిరీలలో ఉన్న క్రీడాకారులు ఈనెల 20 నుంచి మే 20లోపు అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ (ఆర్డీటీ స్టేడియం)లోని జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. ఒరిజినల్ ఫారం-5 (జనన ధ్రువీకరణ పత్రం), ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, తాజా పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, తల్లిదండ్రులు ఆధార్ కార్డులతో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ టౌన్-1 డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జేఎన్‌టీయూ కాలేజ్, ఎల్ఐసీ కాలనీ, చిన్మయినగర్, సుశీలరెడ్డి కాలనీ, ఎల్ఆర్‌జీ స్కూల్, ఎస్‌వీ హోమ్స్, ఇందిరమ్మకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ముందస్తు ఫీజు కోసం ఇబ్బంది పెట్టొద్దు : ఈడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ముందస్తు ఫీజు కోసం విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని సంబంధిత కళాశాల యాజమాన్యాలను ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక గురువారం ఓ ప్రకటనలో ఆదేశించారు. విద్యార్థులు ఫీజు చెల్లించకపోయినా వారి ధ్రువీకరణ పత్రాలను కళాశాల యాజమాన్యం ఆధీనంలో ఉంచుకోరాదన్నారు. కొన్ని కళాశాలలు పోస్ట్‌మెట్రిక్స్ స్కాలర్‌షిప్స్ పథకం కింద అర్హులుగా గుర్తింపు పొంది న విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలా ఫీజులు వసూలు చేసినా, హాల్‌టిక్కెట్లు ఇవ్వకపోయినా, పరీక్షలకు హాజరు కానివ్వకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

షాపింగ్ రూంలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని తాడిపత్రి రోడ్డు వద్ద ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న రెండు గదుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక తెలిపారు. ఈమేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని నెం. 8, 18 గదులు ఖాళీగా ఉన్నాయని, ఈ నెల 30వ తేదీలోగా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలని ఈడీ పేర్కొన్నారు.

సీఐ పుల్లయ్య బాధ్యతల స్వీకరణ

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐగా పుల్లయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ కరణాకర్‌ను వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే. కడప జిల్లాలో పనిచేస్తున్న సీఐ పుల్లయ్యను ఆయన స్థానంలోకి బదలీ చేశారు.

నియామకం


చంద్రకాంత్‌ను సన్మానిస్తున్న చైర్మన్

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా నాయకులు కరణం చంద్రకాంత్ రాష్ట్ర బ్రాహ్మణ సంఘం డైరెక్టర్‌గా నియమితుల య్యారు. గురువారం రాష్ట్ర బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో ప్రమాణా స్వీకారం చేసినట్లు ఆయన తెలిపారు.

రన్ ఫర్ జీసస్‌ను విజయవంతం చేయండి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 19న నిర్వహించనున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ కోఆర్డినేటర్ మోసెస్ అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. సంబంధిత పోస్టర్లను గురువారం అరవిందనగర్‌లోని జీసస్ కంపాషన్ చర్చిలో విడుదల చేశారు. జిల్లాలోని పాస్టర్లందరి సమన్వయంతో ఏటా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాన్ వెస్లీ, సంపత్ విజయ్‌కు మార్, యేసయ్యా, నెహమ్యా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రాప్తాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్మయ్ నగర్ పరిధిలో ఉన్న సచివాలయంలో ఆశా కార్యకర్త వీరమ్మ కూతురు మెదడుకు సంబంధించిన వ్యాధికి గురై బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె వైద్య చికిత్స కోసం రూ.2 లక్షలు అవసరం కాగా... మండలంలోని వైద్య సిబ్బంది అందరూ రూ.26,500 జమ చేశారు. రాప్తాడులో వైద్యాధికారి శివకృష్ణ చేతుల మీదుగా గురువారం ఆమెకు అందజేశారు.

డాక్టర్ సర్వేపల్లికి ఘన నివాళి



విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎస్ఆర్ సొసైటీ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతిని గురువారం స్థానిక నవోదయకాల నీలో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి ప్రెసిల్లా, సహాయ కార్యదర్శి చాందిని, సభ్యులు రాశి, దివ్యతేజ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం కల్చరల్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను కొనసాగిద్దామని తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతిని పురస్కరించుకుని ఆ సంస్థ ఆధ్వర్యంలో కమలానగర్‌లోని సాయి డిగ్రీ కళాశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్‌రెడ్డి, టీఎస్ శ్యాంప్రసాద్, రేవంత్, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ నరసరావుపేట 13వ అదనపు జిల్లా జడ్జిగారి కోర్టులో
ఎం.వి.ఓ.పి. 98/2022
బిట్వీన్
రావూరి శ్రీనివాసరావు ....పిటీషనర్
ఎదిరి
పెనకలపాటి వెంకటేష్ & అదర్స్
....ప్రతివాదులు

టు
1. రెస్పాండెంట్ నెం.1- పెనకలపాటి వెంకటేష్, తండ్రి సూర్యనారాయణ, హిందువు, **Owner of the vehicle, i.e. Goods Carriage No. AP 02 TB 9533, R/o** డోర్ నెం.యం1-38, రామకృష్ణాపురం, బి.యేలేరు, అనంతపురం పోస్ట్ & మం., అనంతపురం జిల్లా.

సదరు పై నెంబరు దావాలో పిటీషనర్ ఇందలి ప్రతివాదులపై ఎం.వి.ఓ.పి దాఖలు చేసియున్నారు. సదరు ఎం.వి.ఓ.పి.లో 1వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా అనేక పర్యాయములు మీకు నోటీసులు పంపినను, మీరు తీసుకొనక, కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది. 25-04-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 ని.లకు మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా : 25-04-2025
కె.ఎస్.ఆర్. అంజనేయులు,
బి.గోపిరాజు,
పిటీషనర్ తరపు అడ్వకేట్స్,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

ప్రజా అవసరాలను తెలుసుకుని సేవలు

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని..వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. స్థానిక లెక్చరర్స్ కాలనీలో రూ. 19లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణానికి ఆయన గురువారం భూమిపూజ చేశారు. అక్కడి నుంచి రుద్రంపేటలో నూత నంగా ఏర్పాటు చేసిన 20ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మీ ఇంటికి.. మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. రుద్రంపేటలో లోఓల్టేజీ సమస్య కారణంగా తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతోందని స్థానికులు తన దృష్టికి తెచ్చారన్నారు. అందుకు ఇక్కడ నూతనంగా 30ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించామన్నారు. విద్యుత్ అధికారులు ఇప్పటి వరకు 20 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో అర్బన్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ జేవీ రమేష్, డీఈఈ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ బాలాస్వామి, ఈఈ షాకీర్, స్థానిక కార్పొరేటర్ లాలు, కార్పొరేషన్ల డైరెక్టర్లు లక్ష్మీనరసింహులు, మూర్తి, నాయకులు రమేష్, దళవాయి వెంకటనారాయణ, సరిపూటి రమణ, రాయల్ మధు, రుద్రంపేట పంచాయతీ ఇన్‌చార్జ్ భక్తవత్సలం నాయుడు, మారుతి నాయుడు, కుమార్ నాయుడు, ఆది, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో బ్యాటరీ కారు ప్రారంభం

● అనంతపురం రూరల్: పర్యాటకులను మరింత ఆకర్షించేందుకు శిల్పారామంలో మరిన్ని ఏర్పాట్లుచేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మండలంలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన నూతన బ్యాటరీ కార్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. శిల్పారామంలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులను అడిగితెలుసుకున్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా ఇక్కడ ఏర్పాట్లు ఉండాలని అధికారులకు సూచించారు.

ఇంటి పట్టాల కోసం స్థల సేకరణ వేగవంతం చేయండి

● ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు స్థల సేకరణను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం సాయంత్రం మండల తహసీల్దార్ మోహన్ కుమార్‌తో పాటు హౌసింగ్ డీఈతో తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గతంలో పలు హౌసింగ్ లేఅవుట్లలో కొందరు ఎలాంటి అర్హత లేకున్నా, స్థానికంగా లేకున్నా ఇళ్ల పట్టాలు తీసుకున్నారని అధికారులు తెలిపారు. వారిలో కొందరు ఇంటి నిర్మాణాలు చేపట్టలేదని, అలాంటి వాటిని గుర్తించి రద్దు చేస్తామని తెలిపారు. దీంతో పాటు పలు గ్రామాల పరిధిలో మొత్తం 30ఎకరాల వరకు సేకరించినట్టు వివరించారు. గత ప్రభుత్వంలో సేకరించి వివాదాల్లో ఉన్న స్థలాలను కూడా క్లియర్ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. త్వరలోనే ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేస్తుందని, అందుకు అనుగుణంగా స్థలం ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పాముురాయి రఘు, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ పాల్గొన్నారు.


రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎస్సీ ఉపవర్గీకరణ చారిత్రాత్మక విజయం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపవర్గీకరణకు కేబి నెట్ అమోదం తెలుపడం సామాజిక న్యాయానికి చారిత్రాత్మక విజ యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఆమె గురువారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎస్సీ ఉపవర్గీకరణకు కేబినేట్ అమోదంపై ఎస్సీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి, ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ... సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ఆధారంగా, మంత్రుల కమిటి సిఫారసు లతో ఎస్సీ వర్గీకరణకు అమోదం తెలిపిందన్నారు. అన్ని ఎస్సీ ఉపకులా లకు న్యాయం జరగాలనే దీర్ఘకాల సమస్య శాశ్వత పరిష్కారానికి ఈ నిర్ణయం బీజం వేస్తుందన్నారు. దళితల ఆత్మగౌరవాన్ని పెంపొందించే ఈ నిర్ణయాన్ని ప్రజలందరూ స్వాగతించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంఘం నాయకులు చిన్న అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల హర్షం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సామాజిక వర్గం సీఎం చంద్రబాబుకు ఎప్పటికీ రుణ పడి ఉంటుందని టీడీపీ ఎస్సీ సెల్ నా యకులు పేర్కొన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతి నిధి లక్ష్మీ నర సింహ, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వన్నూరప్ప, నగర అధ్యక్షుడు వెంకటేష్ గురువారం నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు శివ, తెలుగు యువత నాయకులు రుషివర్ధన్, కదిరిప్ప, హరికృష్ణ పాల్గొన్నారు.

● అనంతపురం రూరల్: టీడీపీతోనే దళితుల అభ్యున్నతి సాధ్యమన్నది మరోసారి నిరూపితమైందని టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గం నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల వారు గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో మీడియాతో హర్షం వ్యక్తం చేశారు. నాయకులు లక్ష్మన్న, ఆనంద్, దస్తగిరి, కుమార స్వామి, ముత్యాలు, వెంకటేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రస్తుత జనాభా ప్రకారం నిధులు మంజూరు చేయాలి

● రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాల్


రాప్తాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 2011 జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరు చేస్తోందని, ప్రస్తుత జనాభా ప్రకారం మంజూరు చేయాలని రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు కేంద్ర ఆర్థిక సంఘం చైర్మన్ సభ్యులను కోరారు. కేంద్ర 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై తిరుపతిలో గురువారం జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఆయన హాజరయ్యారు. ప్రస్తుత జనాభా ప్రకారం ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఉమ్మడి అనంతపురం జిల్లా సర్పంచుల తరపున వినతి పత్రం అందజేశారు.

చలివేంద్రం ఏర్పాటు

నార్పల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద శివకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బొందలవాడ శివకృష్ణచౌదరి ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆ ట్రస్ట్ గౌరవఅధ్యక్షుడు మెల్లంపూటి సూర్యప్రకాష్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకృష్ణచౌదరి మాట్లాడుతూ శివకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 15 సంవత్సరాలుగా విద్య, వైద్యం, ఆహారం పంపిణీ తదితర అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్ ప్రతినిధి కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, రంగాపురం సర్పంచు కుళ్లాయప్ప, సామాజిక సేవకులు లగినేని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చీనీ రైతులకు లాభం చేకూర్చేందుకు కృషి

● ఉద్యాన శాఖాధికారి రత్నకుమార్


డ్రోన్ సర్వేపై శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గార్లదిన్నె, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): చీనీ రైతులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉద్యాన శాఖాధికారి రత్నకుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక రైతుసేవా కేంద్రంలో ఉద్యాన రైతులకు, ఏపీఎంఐపీలోని ఎఫ్‌పీఓలకు డ్రోన్ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ముకుందాపురం గ్రామంలో చీనీ తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్ మాట్లాడుతూ... పండ్లతోటల రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. అందులో భాగంగా చీనీ పండ్లతోటల రైతులకు డ్రోన్ సహాయం ముఖ్యమని గుర్తించిందన్నారు. మండలంలోని ముకుందాపురం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా చేసి రాష్ట్రంలో మొదటి గ్రామంగా గుర్తించిందన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో చీనీ తోటలను సందర్శించి పండ్లతోటలకు జీఎస్ ట్రాకింగ్ చేసి ప్రభుత్వానికి పంపారన్నారు. శుక్రవారం కూడా క్షేత్రస్థాయిలో తిరిగి జీపీఎస్ ట్రాకింగ్ చేస్తామన్నారు. బత్తాయి తోటల్లో జీఎస్ ద్వారా ట్రాకింగ్ చేసి రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాప్తాడు ఏపీఎంఐపీ మైక్రో ఇరిగేషన్ అధికారులు మధు, గణేష్, నాగార్జున, రైతు సేవా కేంద్రం ఎఫ్‌సీటలు, రఘునాథ్‌రెడ్డి, ఏపీ ఎమ్ఐపీ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా ఉద్యానవన అధికారి ఫిరోజ్‌ఖాన్ జూమ్ మీటింగ్ ద్వారా వీక్షించారు.

డంపింగ్ యార్డు వద్దు

● ఎమ్మెల్యేకి నరసనాయనికుంట గ్రామస్థుల వినతి

అనంతపురం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకుండా చూడాలని మండలంలోని నరసనాయనికుంట గ్రామస్థులు ఎమ్మెల్యే పరిటాల సునీతను కోరారు. గ్రామ సమీపంలో డంపింగ్ యార్డు చేస్తున్నారన్న విషయం తెలియడంతో వారు గురువారం కలెక్టరేట్‌లో జరుగుతున్న ఎస్సీఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్‌లో జిల్లా అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. అలాగే అరవింద్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలసి సమస్యను వివరించారు. గ్రామ సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాట వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు మందల తిరుపాలు, రామునాయక్, కిష్టనాయక్, నారప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే క్రిస్టియన్ల అభివృద్ధి : స్వామిదాస్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే క్రిస్టియన్ల అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ పేర్కొన్నారు. ఆయన గురువారం నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ క్రైస్తవుల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిం దన్నారు. గత ఏడాది జూలై నుంచి నవంబరు దాకా అందాల్సిన ఏడు నెలల గౌరవ వేతనాన్ని పాస్టర్ల ఖాతాలోకి రెండు రోజుల్లో జమ కానుందని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు : మేయర్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అధికారులను ఆదేశించారు. గురువారం మేయర్ తన చాంబర్‌లో ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. వేసవి ముగిసే వరకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈలు షాకీర్, నరసింహ, డీఈ సతీష్, ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

టీచర్ల పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీయూ

అనంతపురం విద్య, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డిని కోరారు. ఆ సంఘం నాయకులు బుధవారం సీఈఓను ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజినేయులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉపాధ్యాయులు నెల నెలా చెల్లిస్తున్న పీఎఫ్ రికవరీలు 2021 మార్చి నుంచి ఆన్‌లైన్ చేయడం లేదన్నారు. సీఈఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్, కృష్ణ మోహన్, మల్లికార్జున, నాగభూషణ, మధుసూదన్‌రావు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

మాంటిస్సోరి విద్యార్థులకు జాతీయ పతకాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా యూనిఫైడ్ ఒలంపియాడ్ నిర్వహించే మ్యాథమేటిక్స్ పరీక్షల్లో స్థానిక మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. వారిని గురు వారం స్కూల్‌లో అభినందించారు. మ్యాథమేటిక్స్ ఒలంపియాడ్ యూఐఎంఓ పరీక్షలు పరీక్షల్లో తమ స్కూల్ విద్యార్థులు 100లోపు పలు ర్యాంకులు, పతకాలు సాధించారని తెలిపారు. జాతీయస్థాయిలో విద్యార్థులు సౌమ్యశ్రీ నాలుగో ర్యాంకు, భవిష్య 5, నిధఫాతిమ 16, ఖాజాఅలి, హుస్సేన్ 17వ ర్యాంకు సాధించారన్నారు. 23, 27, 29, 32, 44, 49, 60 వంటి ర్యాంకులను 26 మంది సాధించారని తెలిపారు. పదో తరగతి విద్యార్థి విక్టర్ డేవిడ్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతో విజేతగా నిలిచినట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ కేసు లను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ జిల్లా కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టి, కూడలిలో నిరసన తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, రమేష్, రామ్‌చరణ్ యాదవ్, శర్మాస్‌వలి తదితరులు పాల్గొన్నారు.

రైతుకు తీవ్రగాయాలు

కనగానపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సేద్యపు పనులు చేస్తున్న ఓ రైతు తలపై గుంటక పడి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని మామిళ్లపల్లికి చెందిన రైతు గోవిందరెడ్డి గురువారం తన పొలంలో కంది కొయ్యలు పాసేందుకు ట్రాక్టర్‌తో వెళ్లాడు. గుంటక పాస్తుండగా కొయ్యలు గుంటకలో ఇరుక్కు పోయాయి. దీంతో గోవిందరెడ్డి ట్రాక్టరు దిగి కొయ్యలు తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో గుంటక తలమీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి అనంతపురంలో చికిత్సలందించి, మెరుగైన చికిత్సకోసం బెంగళూరుకు తరలించినట్లు తెలిసింది.

20న క్రికెట్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్, అండర్-23 పురుష క్రికెటర్ల ఎంపిక పోటీలు ఈనెల 20న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. ఆసక్తి, అర్హతగల ఉమ్మడి జిల్లా క్రీడాకారులు అర్హత పత్రాలు, యూనిఫాం, కిట్‌తో హాజరుకావాలని కోరారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

● సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు

అనంతపురం టౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నడుస్తున్న పరిశ్రమల్లో నిబంధనల మేరకు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన గురువారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల భద్రతాకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల్లో భద్రత చాలా ముఖ్యమన్నారు. అత్యవసర ప్రమాదాలు జరిగినపుడు దానిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అన్నివిధాలా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలకు,పర్యావరణానికి ఎటువంటినష్టం జరగకుండా ఉండేందుకు కావాల్సిన ప్రణాళికను రూపొందించాలని సూచించారు. పరిశ్రమల నిబంధనల మేరకు భద్రతపై ప్రతి ఆర్నెల్లకోసారి ప్రతి పరిశ్రమలోను మాక్‌డ్రిల్ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫ్యాక్టరీస్ యాక్ట్ కిందకు రాని పరిశ్రమలలోను భద్రతా తనికీలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమలశాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసయాదవ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంగీత వాయిద్యంలో పూజిత రికార్డు


పూజితను అభినందిస్తున్న వీసీ అనిత

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సంగీత వాయిద్యంలో ఎస్కేయూ లెక్చరర్ పూజిత ప్రపంచ రికార్డును సృష్టించారు. గత డిసెంబరు 1న ఆన్‌లైన్ ద్వారా 18 దేశాలకు చెందిన 1090మందికి సంగీత వాయిద్య ప్రదర్శన పోటీలను నిర్వహించారు. కీబోర్డుతో పూజిత ప్రతిభ కనబర్చి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించారు. ఈ నెల 14న హైదరాబాద్‌లో బ్రదర్ అనిల్ చేతులమీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. గురువారం పూజితను ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ రామచంద్ర అభినందించారు.

టీచర్ల పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీయూ

అనంతపురం విద్య, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డిని కోరారు. ఆ సంఘం నాయకులు బుధవారం సీఈఓను ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజినేయులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉపాధ్యాయులు నెల నెలా చెల్లిస్తున్న పీఎఫ్ రికవరీలు 2021 మార్చి నుంచి ఆన్‌లైన్ చేయడం లేదన్నారు. సీఈఓకు వినతిపత్రం అందించారు. ఎస్టీయూ నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్, కృష్ణ మోహన్, మల్లికార్జున, నాగభూషణ, మధుసూదన్‌రావు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया | Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఎస్.కె.యు అడ్మినిస్ట్రేటివ్ భవనము, అనంతపురము జిల్లా

స్వాధీనత ప్రకటన
సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్) 2002 లోని రూల్ 8(1) క్రింద (స్థిరాస్తి కొరకు)

2002 సంవత్సరము సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (Second) యాక్ట్ 2002 (చట్టం 54 ఆఫ్ 2002) క్రింద దిగువ సంతకందారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్.కె.యు అడ్మిన్ బ్రాంచి (15221)** కు అధీకృత అధికారిగా ఉంటూ మరియు 2002వ సంవత్సరపు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్-**3** తో చదువుకోబడే సెక్షన్ **13(12)** క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ రుణగ్రహీతఐన **శ్రీ బోయపాటి మహేష్** వారికి నోటీసులో తెలియచేసిన బకాయి సొమ్ము **Rs.5,25,96,892.99 (రూపాయలు ఐదు కోట్ల ఇరవై ఐదు లక్షల తొంభై ఆరు వేల ఎనిమిది వందల తొంభై రెండు మరియు తొంభై తొమ్మిది పైసలు మాత్రమే) మరియు వడ్డీ, ఖర్చులు** ను ఈ నోటీసు స్వీకరించిన తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసిందిగా పిలుపునిస్తూ తేది.**07.02.2025** నాడు డిమాండు నోటీసు జారీ చేయడమైనది.

రుణగ్రహీత/హామీదారు సదరు బకాయి సొమ్ము చెల్లించడంలో విఫలమైనందున దిగువ సంతకందారు సదరు చట్టంలోని రూల్స్ యొక్క రూల్-8తో చదువబడే సెక్షన్ **13(4)** క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **15.04.2025** నాడు లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలముగా రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకంగా రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి సదరు ఆస్తి విషయమై ఎవరు కూడా ఎవరితోనూ ఎలాంటి లావాదేవీలు జరుపరాదని అట్లు కాదని జరిపిన యెడల **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్.కె.యు అడ్మిన్ బ్రాంచి** వారికి రావలసిన బకాయి **Rs.5,25,96,892.99 (రూపాయలు ఐదు కోట్ల ఇరవై ఐదు లక్షల తొంభై ఆరు వేల ఎనిమిది వందల తొంభై రెండు మరియు తొంభై తొమ్మిది పైసలు మాత్రమే)** మరియు వడ్డీ ఇతర ఖర్చులతో సహా మొత్తాన్ని చెల్లించేందుకు బాధ్యులగుదురని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుటకై శ్రద్ధ వహించవలెను.

స్థిర మరియు చరాస్తి వివరములు

ఆస్తి నెం.1
1. అనంతపురము, సర్వే నెం.435/2, వార్డు నెం.3 ప్లాటు నెం.35, డోర్.నెం.3/18-ఎ, జె.ఎన్.టి.యు కాలేజ్ దగ్గర, కస్తూరి ఫార్మసీ కళాశాల వైపుగా, ఎల్.ఐ.సి కాలనీలో 24.37 సెంట్ల విస్తీర్ణము ఉన్న నివాస స్థలము మరియు భవనము. ఈ ఆస్తి శ్రీ బోయపాటి గోపాల్, తండ్రి: శ్రీ బి. అచ్చప్ప. **దీనికి హద్దులు:** ఉత్తరము: ఎమ్.ప్రీతికి చెందిన ప్లాటు, దక్షిణము: 30 అడుగుల రోడ్డు, తూర్పు: సర్వే నెం.435-3 నందు బి. గోపాల్‌కు చెందిన ప్లాటు. పడమర: సర్వే నెం.434-2 నందు బి. మహేష్ కు చెందిన ప్లాటు. కొలతలు: విస్తీర్ణము:24.37 సెంట్లు.

ఆస్తి నెం.2
2.అనంతపురము, సర్వే నెం.434/2, వార్డు నెం.3 ప్లాటు నెం.35, డోర్.నెం.3/18, జె.ఎన్.టి.యు కాలేజ్ దగ్గర, కస్తూరి ఫార్మసి కళాశాల వైపుగా, ఎల్.ఐ.సి కాలనీలో 7.70 సెంట్ల విస్తీర్ణము ఉన్న నివాస స్థలము మరియు భవనము. ఈ ఆస్తి శ్రీ బోయపాటి గోపాల్, తండ్రి: శ్రీ బి. అచ్చప్ప. **దీనికి హద్దులు:** ఉత్తరము: ప్లాటు నెం.35 నెంబరు నందలి మిగిలిన స్థలము, దక్షిణము: 30 అడుగుల రోడ్డు, తూర్పు: సర్వే నెం.435/1,2,3, నందలి ప్లాటు, పడమర:40 అడుగుల రోడ్డు, కొలతలు: విస్తీర్ణము:7.70 సెంట్లు.

ఆస్తి నెం.3
3.అనంతపురము, సర్వే నెం.435/3, ప్లాటు నెం.35, డోర్.నెం.3/18, ఇంజనీరింగ్ కాలేజ్ రోడ్డు, కస్తూరి ఫిజియోథెరపి కళాశాల దగ్గర, పాత కుమార్ పెన్సిల్ ఫ్యాక్టరి దగ్గర, ఎల్.ఐ.సి కాలనీలో 8.75 సెంట్ల విస్తీర్ణము ఉన్న నివాస స్థలము. ఈ ఆస్తి శ్రీ బోయపాటి గోపాల్, తండ్రి: శ్రీ బి. అచ్చప్ప. **దీనికి హద్దులు:**ఉత్తరము:కృష్ణమూర్తిగారి భార్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, దక్షిణము:పాత కుమార్ పెన్సిల్ ఫ్యాక్టరి, తూర్పు: రోడ్డు, పడమర:సొంత ఆస్తి, కొలతలు: విస్తీర్ణము:8.75 సెంట్లు.

ఆస్తి నెం.4
4.అనంతపురము, సర్వే నెం.435/5, ప్లాటు నెం.60, డోర్.నెం.0.013, ఇంజనీరింగ్ కాలేజ్ రోడ్డు, ఎల్.ఐ.సి కాలనీలో 3.12 సెంట్ల విస్తీర్ణము ఉన్న నివాస స్థలము. ఈ ఆస్తి శ్రీ బోయపాటి గోపాల్, తండ్రి: శ్రీ బి. అచ్చప్ప. **దీనికి హద్దులు:** ఉత్తరము:ప్లాటు నెం.59, దక్షిణము:ప్లాటు నెం.61, తూర్పు:సర్వే నెం.435/6 నందలి భూమి, పడమర:30 అడుగుల రోడ్డు, కొలతలు: విస్తీర్ణము:3.12 సెంట్లు.

ఆస్తి నెం.5
5.అనంతపురము, సర్వే నెం.433/1బి, డోర్.నెం.0.036, ఇంజనీరింగ్ కాలేజ్ రోడ్డు, ఎల్.ఐ.సి కాలనీ దగ్గర 9 సెంట్ల విస్తీర్ణము ఉన్న నివాస స్థలము. ఈ ఆస్తి శ్రీ బోయపాటి గోపాల్, తండ్రి: శ్రీ బి. అచ్చప్ప. **దీనికి హద్దులు:** ఉత్తరము:అత్తారుకు చెందిన 100 అడుగుల మాస్టర్ ప్లాన్ నందలి భూమి, దక్షిణము:ఇదే సర్వే నెంబరులో రంజని డేనియల్‌కు చెందిన భూమి, తూర్పు:కె. రాజేశ్వరికి చెందిన భూమి, పడమర:పి. పద్మావతికి చెందిన భూమి, కొలతలు: విస్తీర్ణము:9 సెంట్లు.

ఆస్తి నెం.6
6.అనంతపురము, సర్వే నెం.435/3, డోర్.నెం.3-18, ఇంజనీరింగ్ కాలేజ్ రోడ్డు, ఎల్.ఐ.సి కాలనీ దగ్గర 19 సెంట్ల విస్తీర్ణము ఉన్న నివాస స్థలము. ఈ ఆస్తి శ్రీ బోయపాటి గోపాల్, తండ్రి: శ్రీ బి. అచ్చప్ప. **దీనికి హద్దులు:** తూర్పు: రోడ్డు, దక్షిణము: మేస్త్రీ చిన్న మాదన్న ఇతరులకు అమ్మిన ప్లాటు, పడమర: దేవరపల్లి ఓబన్న ఇతరులకు అమ్మిన భూమి, ఉత్తరము: క్రిష్ణమూర్తి కి చెందిన ఖాళీ స్థలము, కొలతలు: విస్తీర్ణము:19 సెంట్లు.

Properties are extended to the following loan accounts as follows:

Property No.	Extension of Loan Ac No	Scheme code
1	152215030000001	CCAGR
	152216390000001	TL009
2	152216390000001	TL009
	152215030000001	CCAGR
3	152216040000001	RA008
	152215030000001	CCAGR
	152216390000001	TL009
4 & 5	152230100001237	ELGEN
6	152216680000002	ML001

Hypothecation of movable property described herein below:
List of Plant & machinery /Equipment:

Description	Quantity
Liquid Nitrogen Container	5
Sexed Semen Straw	10
IVF Laboratory Equipment	1unit
304 SS Bulk Milk Cooler - 3000 Litre Capacity	1
Fixed Model 10 - bucket Milking Machine	1
Fodder Harvester	1
PVC Pipes	1 set
Electrical Motors	1
Misc items supporting to Electric Motors	1 unit
25 KVA Generator	1
Super carry vehicle	1
Mahindra Tractor	1
Tipping Trailer	1

Date: 15.04.2025 | **Sd/-AUTHORIZED OFFICER ,**
Place: S.K.U Admin Branch | **UNION BANK OF INDIA.**

విద్యార్థినికి ఎమ్మెల్యే ల్యాప్‌టాప్ బహూకరణ



షబనాజ్‌కు ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో బైపీసీలో అత్యధికంగా 993 మార్కులు తెచ్చుకున్న పట్టణానికి చెందిన విద్యార్థిని షబనాజ్‌కు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. స్థానిక హనుమేశ్ నగర్‌లోగల విద్యార్థిని ఇంటికి గురువారం ఉదయం ఎమ్మెల్యే వెళ్లారు. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులను సాధించినందుకు షబనాజ్‌ను అభినందించి ల్యాప్‌టాప్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎంట్రెన్స్‌లోనూ ప్రతిభ చాటి ఎంబీబీఎస్ చదవాలన్న కలను సాకారం చేసుకోవాలని సూచించారు. ఉన్నత విద్యకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

కార్పెంటర్ల సమస్యలు పరిష్కరిస్తా

గుంతకల్లు: పట్టణంలో కార్పెంటర్ల సమస్యల్ని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని ఈద్గా ఫైనారిటీ ఫంక్షన్ హాల్‌లో కార్పెంటర్లు ఐకమత్య సమితి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టణంలో స్వర్ణకారులకు ఒక చోట వాణిజ్య సముదాయం ఉన్నవిధంగానే.. వడ్రంగి వృత్తిదారులకు కూడా ఒకేచోట పనిస్థలాన్ని కేటాయించడానికి కృషిచేస్తానని తెలిపారు. కార్పెంటర్లు పీఎం విశ్వకర్మ పథకం కింద స్టై ఫండ్‌తో నైపుణ్య శిక్షణను పొందాలని సూచించారు. తర్వాత ఈ సంఘ నాయకులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో సన్మానం చేశారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గుమ్మనూరుకు ఆర్‌పీల సన్మానం

పామిడి: మెప్మా నుంచి ఆర్‌పీలను డీఆర్‌డీఏ వెలుగుకు బదలాయించడంపై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను ఆర్‌పీలు ఘనంగా సన్మానించారు. గుంతకల్లు పట్టణంలో వారు ఆయన్ను కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం పామిడి నగర పంచాయతీని గ్రామ పంచాయతీగా మార్చడంతో మెప్మాలోని ఆర్‌పీలకు సంవత్సరం పాటు వేతనాలు ఇవ్వలేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాల రుణాల మంజూరులోనూ తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయన్నారు. వీటిపై గత ఏడాది నవంబరు 28న ఆంధ్రజ్యోతిలో మెప్మా, డీఆర్‌డీఏ పంచాయతీ అనే శీర్షికన కథనం ప్రచురితమైందని, ఇందుకు ఎమ్మెల్యే స్పందించి డీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడి డీఆర్‌డీఏ వెలుగుకు ఆర్‌పీలను బదలాయింపజేశారని తెలిపారు. ఇందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జింకల సంజీవకుమార్, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆదర్శపాఠశాలలో ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబులరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.150, బీసీ, ఓసీలకు రూ.200 రుసుం చెల్లించాలన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ల నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఈదురు గాలులకు నేలరాలిన మామిడి

శెట్టూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుంపల్లి, తిప్పనపల్లి, కనుకూరు, ములకలేడు గ్రామాల్లో బుధవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు మామిడికాయలు నేలరాలాయి. పలు తోటల్లో చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో తీవ్ర నష్టాలకు గురవుతున్నామని బాధిత రైతులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యానశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి తమకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి పరిహారం అందించాలని కోరారు.




అనుంపల్లిలో నేలరాలిన మామిడి కాయలు

రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యురాలిగా రేష్మాపర్వీన్



తాడిపత్రి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ కౌన్సిలర్ రేష్మాపర్వీన్ రాష్ట్ర హజ్‌కమిటీ మెంబరుగా ఎంపికయ్యారు. ఈ మేరకు కమిటీ సభ్యులు ఎంపిక చేసినట్లు గురువారం ఆమె ప్రకటనలో తెలిపారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, మైనార్టీశాఖ మంత్రి ఫరూక్, స్టేట్ హజ్‌కమిటీ చైర్మన్ హసీన్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టీడీపీ నాయకులు ఆమెను సన్మానించారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



కార్తీక్ (ఫైల్)

గుమ్మఘట్ట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఓ విద్యార్థి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గొల్లపల్లికి చెందిన ధనలక్ష్మి, తిప్పేస్వామి దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. వారిలో చిన్నవాడైన కార్తీక్ (16) ఇటీవల 10వ తరగతి పరీక్షలు రాసి ఫలితాల కోసం వేచి చూస్తున్నాడు. ఇదిలాఉండగా.. గురువారం రాత్రి కార్తీక్ తండ్రికి తోడుగా వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పంటకు నీరు పెట్టేందుకు మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తండ్రి తిప్పేస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి తీరువా వసూలు చేయండి: ఆర్డీఓ



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

ఆంధ్రజ్యోతి స్పందన

బొమ్మనహాళ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్, కణేకల్లు మండలాలలో నీటితీరువా బకాయిలను వేగవంతంగా వసూలు చేయాలని కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు బొమ్మనహాళ్, కణేకల్లు తహసీల్దార్లను ఆదేశించారు. నీటితీరువా వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడంపై గత గత గురువారం ఆంధ్రజ్యోతిలో నీటి తీరువాపై నిర్లక్ష్యం అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు కలెక్టర్ స్పందించి నీటితీరువా వసూలుపై కళ్యాణదుర్గం ఆర్డీఓను ఆదేశించారు. వెంటనే ఆయన బొమ్మనహాళ్ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెండు మండలాల తహసీల్దార్లతోపాటు రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగునీటి సంఘాల వారితో కలిసి గ్రామాలలో సమావేశం నిర్వహించి నీటితీరువా వసూలు వేగవంతం చేయాలని, బకాయిల వసూలు ఈ నెలాఖరికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇది ఇలా ఉండగా బొమ్మనహాళ్ మండలంలో గురువారం ఒక్కరోజే రూ.50 వేలు నీటితీరువా రైతుల నుంచి వసూలు చేసినట్లు తహసీల్దార్ మునివేలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

నవరత్నాల పేరుతో జగన్ నయవంచన

● టీడీపీ కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విప్ కాలవ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌రెడ్డి నవరత్నాల పేరిట ప్రజలను నయవంచన చేశారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని సోమలాపురం గ్రామ సమీపంలోగల ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం టీడీపీ కార్యకర్తల మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కాలవ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ఐదేళ్ల జగన్ అరాచకపాలన సాగించారని, బూటకపు హామీలతో ప్రజలను మోసం చేశారని అన్నారు.. వైసీపీహయాంలో ఎన్ని అరాచకాలు కొనసాగించినా టీడీపీ కార్యకర్తలు, నాయకులు బెదరకుండా కసితో పనిచేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చారని కొనియాడారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుందని అన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలను విస్మరించదని, వారి కృషికి తగ్గ ఫలి తం తప్పక అందిస్తుందని తెలిపారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి గ్రామంలో టీడీపీ జెండా ఎగిరే విధంగా కృషి చేయాలని కోరారు. సీఎం చంద్రబాబు 75వ జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలోని 75 మంది అనాథ పిల్లలను దత్తత తీసుకొని వారి అభ్యున్నతికి పాటుపడదామని, ఇదే ముఖ్యమంత్రికి మనమిచ్చే గొప్ప బహుమతి అని చెప్పారు. విధివిధానాల్లో 40 శాతం యువతకు అవకాశం ఇవ్వాలన్నదే మంత్రినారా లోకేష్ ముఖ్య ఉద్దేశమనీ, కావున ప్రస్తుతం ఎన్నుకుంటున్న పలు కమిటీలలో యువతకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, ఆర్యవైశ్య రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగల్లి రాజు, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, మండల వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, టీడీపీశ్రేణులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై చర్చ



కణేకల్లులో సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు నరేంద్ర

కణేకల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీ వండ్రయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో తొలుత హనుమాపురం టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు నరేంద్ర మాట్లాడుతూ.. 2023లో పప్పుశనగ పంట నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదని, వెంటనే అధికారులు చొరవచూపి అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఆ గ్రామ సర్పంచ్ జయరాంచౌదరి, బిదురకుంతం సర్పంచ్ హనుమంతప్ప, కళేకుర్తి సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ శర్మాస్ తమ గ్రామాల్లోని వివిధ సమస్యల్ని సమావేశం దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ లీలావతి, డీటీ విశ్వనాథ్, ఈ ఓఆర్డీ చంద్రమౌళి, సర్పంచ్ రుద్రముని, పంచాయతీ కార్యదర్శులు తిమ్మప్ప, గంగాధర, సురేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మ అధ్యక్షన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి చేపట్టిన పనులను వివరించారు. వేసవిలో అవసరమైన కీలకశాఖ అధికారులు గైర్హాజరవ్వడం గమనార్హం. విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యాధికారులు డుమ్మాకొట్టారు. మండలంలో తాగునీటి సమస్య, కరెంట్ కోతలపై చెబుదామంటే ఆయా అధికారులు హాజరుకాకపోవడంపై సభ్యులు మండిపడ్డారు. ఉద్యానవన, ఎక్సైజ్, హౌ చ్చెల్సీ అధికారులు కూడా సమావేశానికి డుమ్మాకొట్టారు. కొందరు ఎంపీటీసీ సభ్యులు సమావేశం జరుగుతుండగానే సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్, తహసీల్దార్ మునివేలు, ఏఓ సాయికుమార్, పీఆర్ జేఈ జగదీష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి: ఎన్‌ఎంయూ



తాడిపత్రిలో ఎన్‌ఎంయూ నాయకుల ధర్నా

తాడిపత్రి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సిబ్బంది సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజనల్ సెక్రటరీ ప్రతాప్‌నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం ఆయన నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీలో ఉన్న పాత వైద్యవిధానాన్ని ప్రవేశపెట్టాలని, గ్యారేజీ ఉద్యోగులకు సరైన పనిముట్లు అందజేయాలని, రిటైర్డ్ ఉద్యోగులను సూపర్‌లగ్జరీ బస్సుల్లో అనుమతించాలని, ఆన్‌కాల్ డ్రైవర్లకు నెలవారీ జీతాలు ఇవ్వాలని, అక్రమ సస్పెన్షన్లు ఆపాలని కోరారు. ధర్నాలో నాయకులు సుధాకర్, రామకృష్ణ, రియాజ్, రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

●గుత్తి : ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌ఎంయూ నాయకులు పట్టణంలోని ఆర్టీసీ డిపోవద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎన్‌వీ రాముడు, గ్యారేజ్ కార్యదర్శి శంకరయ్య, అధ్యక్షుడు గోపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●రాయదుర్గంటౌన్: ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ డిపో అధ్యక్ష కార్యదర్శులు పీఎస్కే. జలాల్, తిప్పేస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. రీజనల్ వైస్ ప్రెసిడెంట్ దామోదర్, రీజనల్ జాయింట్ సెక్రెటరీ సుబ్బరాయుడు, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు దాదాపీర, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న చైర్ పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. పలువురు అధికారులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈదురుగాలులు, వర్షాలు వస్తున్నందున విద్యుత్ కోతలు ఉండడంతో వీరాపురం నుంచి నీటి పంపింగ్ చేయడానికి ఆలస్యమవుతోందన్నారు. దీంతో పట్టణంలో నీటి సరఫరాలో జాప్యం జరుగుతోందని తెలిపారు. దీంతో వెంటనే చైర్ పర్సన్ విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఏఈలతో ఫోన్ ద్వా రా మాట్లాడి వీరాపురం నీటి పంపింగ్‌కు ప్రత్యేక విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. అందుకు ఎస్ఈ సానుకూలంగా స్పందిస్తూ ఏడీతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. ఇక ముందు నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ నరసింహులుకు చైర్‌పర్సన్ సూచించారు. ఇకపై వార్డులలో సక్రమంగా నీటిని వదలాలని తెలిపారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

తాడిపత్రి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 22, 23వ తేదీల్లో బండ్లపల్లి నుంచి అనంతపురం వరకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర జరగనుందని, విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య కోరారు. మండలంలోని తేరన్నపల్లి గ్రామంలో గురువారం ఆయన ఈ మేరకు పిలుపునిచ్చారు.


నిరసన ర్యాలీని జయప్రదం చేయండి

గుంతకల్లుటౌన్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పట్టణంలో శనివారం నిరసన ర్యాలీ చేపట్టనున్నామని, జయప్రదం చేయాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లోని మదీనా ఆర్చ్ వద్ద గురువారం వారు ఈ మేరకు పోస్టర్లను విడుదల చేశారు. కమిటీ నాయకులు సద్దాం, రఫీ, అబ్దుల్ అజీజ్, ఫరూక్, మౌలా, ఆరీఫ్, బందానవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడండి

ఉరవకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురి నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పలు రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ మహబూబ్‌బాషా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సీపీఎం నాయకుడు మధుసూదన్ మాట్లాడుతూ.. మరణించిన వారి ఓట్లను ఓటర్ల జాబితాలోంచి తొలగించాలని కోరారు. ఓటర్ల లిస్టులో ఫొటోల్లో తప్పులు ఉన్నాయని, వాటిని సరిదిద్దాలని టీడీపీ, జనసేన నాయకులు గోవింద్, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఓటర్ల జిబితాల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు చంద్రశేఖర్, నరేష్, ఈడీటీ వరప్రసాద్, నాయకులు శీనా, రాజేష్, ఏసీ ఎర్రిస్వామి, మురళి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఉరవకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండల కేంద్రంలోని జనార్ధన వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలోని మూలవిరాట్‌కు పత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు చేశారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో అమ్మవారి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తర్వాత అర్ధరాత్రి గరుడ వాహనసేవను నిర్వహించారు. ఆలయ ఈఓ కృష్ణయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

యాడికి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చారుమేకలపల్లి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌బాషా అదృశ్యమైనట్లు గురువారం కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. షేక్ మహబూబ్‌బా షా నాలుగునెలలక్రితం ఇంటి నుంచి వెళ్లిపోయారు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి భార్య ఖాజాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

అధికలోడు వాహనాల సీజ్

తాడిపత్రి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అధికలోడుతో వెళుతున్న ట్రాక్టర్లు, లారీలతో పాటు రికార్డులు లేని వాహనాల సీజ్‌చేశామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ గురువారం తెలిపారు. రికార్డులు సరిగా లేకుండా, టాక్స్ చెల్లింపు లేకుండా తిరుగుతున్న వాహనాలను, అధికలోడుతో వెళుతున్న సిమెంట్ లారీలు, నాపరాళ్ల లారీలు, ట్రాక్టర్లు మొత్తం ఆరింటిని సీజ్‌చేశామని, వాటికి రూ.1.50లక్షలు అపరాధ రుసుం విధించామని చెప్పారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

పట్టణ సమీపంలోని అనంతపురం రహదారిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి అధికటన్నేజీతో వెళుతున్న గ్రానైట్ గుం డు లారీని సీజ్ చేశారు. అలాగే రూ.1.31లక్షలు జరిమా నా విధించారు. విజిలెన్స్ సీఐ సద్గురుమూర్తి, ఎస్‌ఐ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

తాడిపత్రి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో 3సెంట్లు పేదలకు కేటాయించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మహిళా కార్యదర్శి సావిత్రమ్మ, నాయకులు అబ్రహం, నాగార్జున, ఫాతిమా తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం: ఏఎస్పీ

పెద్దపప్పూరు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏఎస్పీ రోహిత్‌చౌదరి సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు వచ్చి పలు సమస్యలను ఏఎస్పీ దృష్టికి ఫిర్యాదుల ద్వారా తీసుకొచ్చారు.వాటిని పరిశీలించిన ఆయన చట్టపరంగా త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. సీఐ వెంకటసుబ్బయ్య, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

గుత్తి,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఓషాపు ఎదుట ఉంచిన తన ద్విచక్రవాహనం చోరీకి గురైందని స్థానికుడు ప్రశాంత్ గురువారం పోలీసులు ఫిర్యాదు చేశాడు. ప్రశాంత్ అనంతపురం రోడ్డులో పనినిమిత్తం వెళ్లి ఓషాపు వద్ద బజాజ్ సీడీ 100 బైక్‌ను పార్క్ చేశాడు. కొద్ది సేపటి తర్వాత వచ్చి చూడగా.. బైక్ కని పించలేదు. చోరీకి గురైందని గ్రహించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు సంఘటన జరిగిన ప్రదేశంలో సీసీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు బైక్‌ను చోరీ చేసి తీసుకెళ్తున్నట్లు దృశ్యాలు రికార్డయ్యాయి. నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

21, 22న విద్యుత్ పరఫరా నిలిపివేత

విడపనకల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలో 21, 22వ తేదీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సత్యం గురువారం ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు సబ్ స్టేషన్‌లో ట్రాన్స్ ఫార్మర్లకు మరమ్మతులు చేస్తున్న కారణంగా .. విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు చెప్పారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు

పెద్దవడుగూరు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవడుగూరు గ్రామంలో గురువారం క్షయవ్యాధి సోకిన వ్యక్తుల వద్ద నివసించే ప్రజలకు వైద్యుడు శ్రీనివాసబాబు వైద్య పరీక్షలు నిర్వహించారు. క్షయవ్యాధిని నిర్మూలించే కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పరీక్ష చాలా ఉపయోగపడుతుంద తెలిపారు. ఇందులో వ్యాధి నిర్ధారణ అయితే నివారణకు మందులను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని అన్నారు. టీబీ యూనిట్ అధికారులు దేవదాసు, మన్సూర్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సీహెచ్ఓ జ్యోతి పాల్గొన్నారు.

తిరుపతిలో వ్యర్థాల నిర్వహణపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వ్యర్థాల నిర్వహణపై 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద పనగారియా ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశానికి తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తాడిపత్రి మున్సిపాలిటీ అభివృద్ధిపై జేసీపీఆర్‌ను ఆర్థిక సంఘం చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. అక్కడ చేస్తున్న అభివృద్ధి తదితర అంశాలపై ఆరాతీశారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి పట్టణంలో చెత్తసేకరణ విభాగంలో పొడిచెత్త, తడిచెత్త వేర్వేరుగా చేసి వాటిని ప్లాంట్‌కు తరలించి యంత్రాల ద్వారా ఉపయోగకరమైన పదార్థంగా చేస్తున్నామని తెలిపారు.

ఉద్యోగోన్నతి కల్పించడం పట్ల హర్షం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈఓఆర్డీలను డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రభుత్వం ఉద్యోన్నతి కల్పించడం హర్షణీయమని ఈఓఆర్డీ నాగభూషణం గురువారం ప్రకటనలో తెలిపారు. 20 ఏళ్లుగా తమల్ని గుర్తించాలని ప్రభుత్వాలతో పోరాడుతున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమను గుర్తించిందన్నారు. ఈఓఆర్డీలను డిప్యూటీ ఎంపీడీఓలుగా మార్పు చేస్తు ఎంపీడీఓ పదోన్నతిలో 60శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీఓ 35ను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. ఇందుకు ప్రభుత్వపెద్దలకు, పంచాయతీ రాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజకు ధన్యవాదాలు తెలిపారు.

మొక్కజొన్న పంటకు నిప్పు

బాధిత రైతును ఆదుకుంటామని కాలవ భరోసా

రాయదుర్గంటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదరంపల్లిలో రైతు గొల్ల కుమారస్వామికి చెందిన తొమ్మిదిఎకరాల్లోని మొక్కజొన్న పంటకు గురువారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో కోత దశలో ఉన్న ఐదెకరాల్లోని పంట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. అగ్నిమాపకశాఖ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈలోగానే చాలా వరకు పంట కాలిపోయింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వవిప్ కాలవ కాలవ శ్రీనివాసులు విచారం వ్యక్తం చేశారు. బాధిత రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తప్పక పరిహారం అందేలా చేస్తామని తెలిపారు. పంట నష్టంపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపాలని వ్యవసాయ అధికారులను ఆయన ఆదేశించారు.

మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: జనసేన

తాడిపత్రి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పేరు చెప్పి కొంద రు వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారిపై అప్రమత్తంగా ఉండాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మట్లాడారు. పట్టణ సమీపంలోని ఆర్టీటీ కాలనీలో కొందరు వ్యక్తులు జనసేన నుంచి వచ్చామని, మీకు పింఛన్లు ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. అలాంటివారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా మీ దగ్గరకు వచ్చి ఫలానా అంటూ మో సాలకు పాల్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కాలవ భరత్

కణేకల్లు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చిక్కణ్ణేశ్వర స్వామి రథోత్సవంలో భాగంగా గురువారం దున్నపోతులతో రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. మేజర్ గ్రామ పంచాయతీ, టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మండల వ్యాప్తంగా దాదాపు 14 జతల దున్నపోతులు పాల్గొన్నాయి. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పోటీలను ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు పోటీపోటీగా జరిగాయి. విజేతలుగా కణేకల్లుకు చెందిన ముజ్జు దున్నపోతులు ప్రథమ, తిప్పేష్‌కు చెందిన దున్నపోతులు ద్వితీయ, రిజ్వంత్‌కు చెందిన దున్నపోతులు తృతీయస్థానాల్లో నిలిచాయి. స్థానిక సర్పంచ్ ఫ్లోరెన్స్ నిర్మల, టీడీపీ కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ కన్వీనర్ ఆనంద్‌రాజ్, ఈఓ ప్రసాద్ మొదటి విజేతకు రూ. 20 వేలు, రెండో విజేతకు రూ.12 వేలు, మూడో విజేతకు రూ.8 వేల నగదు బహుమతులను అందజేశారు. చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

గుత్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని హిందూ అనుసంధాన సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు అధికార దాహం, స్వలాభం కోసం మత రాజకీయాలు చేస్తూ హిందూవులపై దాడులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇందుకు పశ్చిమ బెంగాల్ నిదర్శనమన్నారు. ఈసంఘటనను ఖండిస్తూ ఈనెల 22న పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. హిందువులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హిందూ అనుసాంధన సంస్థల ప్రతినిధులు తిమ్మారెడ్డి, మురళీ, ఆకుల శీన, రమణ, నాగయ్య, వెంకప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ విద్యార్థులు గత నెలలో ఆర్మీలోని అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య తెలిపారు. ఆ విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఏడాది బీజడ్‌సీ తృతీయసంవత్సరం చదువుతున్న మధు, బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న మహేంద్ర, బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న వీరేష్ అగ్నివీర్ ఉద్యోగులుగా ఎంపికయ్యారని తెలిపారు. వారిని ఎన్‌సీసీ అధికారి బాలకృష్ణ, కామర్స్ శాఖ అధ్యక్షుడు జనార్ధనశాస్త్రి, పీడీ సురేష్, అధ్యాపకులు అభినందించారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్‌ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి అశ్వర్థ అగ్ని అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలా బయటపడాలో మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. హెచ్‌ఎం రవికుమార్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాలు నాలుగవ రోజూ కొనసాగాయి. ఈ సందర్భంగా శ్రీనివాసపురంలో ఉన్న శ్రీ సుధా శ్రీరాములు మెమోరియల్ రోటరీ మున్సిపల్ హైస్కూల్‌లో అగ్నిమాపక అధికారి మోహన్‌బాబు విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఉపాధ్యాయులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.